Follow: @ANNTELUGU
10-04-2025
ANN తెలుగు
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 129 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ట్రంప్ సంచలన నిర్ణయం
### 90 రోజుల పాటు టారిఫ్స్ నిలిపివేత
### భారత్ తో సహా ప్రధాన దేశాలకు ఊరట

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. చైనా తప్ప మిగతా 70 దేశాలపై విధించిన ప్రతీకార సుంకాలను 90 రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అదే సమయంలో చైనాపై టారిఫ్పు 125%కి పెంచుతున్నట్లు తెలిపారు. చైనా ప్రపంచ మార్కెట్లను అగౌరవపరిచిందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. కాగా, అమెరికా వస్తువులపై చైనా 84% టారిఫ్ విధించిన సంగతి తెలిసిందే.

**టాప్ న్యూస్**

### ఇంకా 30 రోజులే మిగిలింది!
- ప్రపంచ అందాల పోటీలపై స్మితా సభర్వాల్ ట్వీట్
- ఆతిథ్యం అంటే తెలంగాణ అనేలా ఏర్పాట్లు

03



### మోహన్ బాబుకు గట్టి దెబ్బ
- అనుకూలంగా ఇచ్చిన తీర్పును కొట్టి వేసిన కోర్టు
- తప్పుడు సాక్ష్యాలను సమర్పించారన్న మనోజ్
- ఏకీభవించిన కోర్టు

02



### తమిళిసై ఇంట్లో తీవ్ర విషాదం
- ఆమె తండ్రి అనంతన్ కన్నుమూత
- సంతాపం తెలిపిన సీఎం రేవంత్

03






# తెలంగాణలో బీజేపీని ఖతం చేస్తాం
## కాస్కో బీజేపీ
- రాహుల్ సమక్షంలో రేవంత్ పవర్‌ఫుల్ స్పీచ్
- గాంధీ పరివార్‌కు, గాడ్సే పరివార్‌కు మధ్య రాజకీయ పోరాటం
- రాహుల్ గాంధీ గ్యారంటీ అంటే కచ్చితంగా అమలయ్యే గ్యారంటీ
- ఏఐసీసీ సమావేశాల్లో సీఎం ప్రసంగానికి ప్రశంసలు

02

*గాంధీ పరివార్‌కు, గాడ్సే పరివార్‌కు మధ్య జరుగుతున్న రాజకీయ పోరాటంలో గెలుపు గాంధేయవాదులదేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అహ్మదాబాద్ వేదికగా జరగుతున్న ఏఐసీసీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీని ఖతం చేయడమే తమ లక్ష్యమన్నారు. గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ పుట్టిన గడ్డపై సీడబ్ల్యూసీ సమావేశాలు జరిగాయని, ఇక్కడి సమావేశాల స్ఫూర్తితో తిరిగి తెలంగాణకు వెళ్లి బీజేపీని ఖతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. మోదీ గ్యారంటీలతో దేశ ప్రజలను బీజేపీ మోసం చేస్తోందని విమర్శించారు. మణిపూర్‌లో అశాంతి, ఢిల్లీలో రైతుల ఆందోళనపై మోదీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ మాట ఇస్తే అమలు చేసి తీరుతామన్నారు. రాహుల్ గాంధీ గ్యారంటీ అంటే కచ్చితంగా అమలయ్యే గ్యారంటీ అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.*


**- మహా, అహ్మదాబాద్**

# దేశానికి తెలంగాణ మార్గం చూపింది



### కులగణనను తెలంగాణలో విజయవంతం చేశాం
- బీసీల రిజర్వేషన్ల పెంచుతూ కేంద్రానికి రేవంత్ బిల్లు పంపారు
- రేవంత్ పంపిన బిల్లుపై కేంద్రం చర్యలు తీసుకోవట్లేదు
- వక్ఫ్ సవరణ చట్టం మత స్వేచ్ఛపై దాడి..
- ఏఐసీసీ సమావేశంలో రాహుల్ గాంధీ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై ప్రశంసలు

**అహ్మదాబాద్, మహా :** దేశ సమస్యలు తీర్చాలంటే.. దేశాన్ని ఎక్స్‌రే తీయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దళితులు, ఆదివాసీల సమస్యలపై దృష్టిపెట్టాలన్నారు. దళితులు, ఆదివాసీలకు న్యాయం జరుగుతోందా అనే ప్రశ్న తలెత్తుతోందన్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని రాహుల్ విమర్శించారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడారు.



మిగతా 3లో


### మొయినాబాద్ ఫాంహౌస్‌లో ముజ్రా పార్టీ
- భగ్నం చేసిన ఎస్వోటీ పోలీసులు
- ఏడుగురు యువతులు, 14 మంది యువకుల అరెస్టు
- గంజాయి పట్టివేత

వివరాలు 3లో

## మీ పార్టీ కరోనా కంటే డేంజర్
### అధికారంలోకి పక్కా వస్తం
### రేవంత్‌కు బండి సంజయ్ కౌంటర్

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం పక్కా అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. కరోనా కంటే ప్రమాదకరమైన పార్టీ కాంగ్రెస్ అని ఆరోపించారు. తెలంగాణలో రేవంత్ కాలం చెల్లిందని అన్నారు. సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో బీజేపీ ఎంపీ గెలిచారు.

మిగతా 2లో



### ఆయన రానివ్వడం ఏంది... ఎప్పుడో వచ్చాం
- అహ్మదాబాద్ లో సీఎం రేవంత్ వ్యాఖ్యలపై ఎంపీ రఘునందన్ రావు
- ఈ రాష్ట్రానికి కాంగ్రెస్ చివరి సీఎం రేవంత్ రెడ్డి అని వ్యాఖ్య



**మహా :** తెలంగాణలోకి బీజేపీది రానిచ్చేదే లేదంటూ అహ్మదాబాద్ ఏఐసీసీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు కౌంటర్ ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన రఘు నందర్ రావు బీజేపీని తెలంగాణలోకి రేవంత్ రెడ్డి రానివ్వకపోవడం ఏంది, మేం ఎప్పుడో వచ్చామన్నారు. ఈ రాష్ట్రానికి చివరి కాంగ్రెస్ సీఎంగా రేవంత్ రెడ్డి నిలిచిపోతారన్నారు.

మిగతా 2లో

### రేపో రేట్లు తగ్గించిన ఆర్బీఐ
తగ్గనున్న వాహన, వ్యక్తిగత రుణాల వడ్డీ రేట్లు
ఆర్బీఐపై మల్హోత్రా మార్క్
రెండవ త్రైమాసికంలోనూ రేపో రేటు తగ్గింపు


వివరాలు 2లో




## ట్రిబుల్ ఆర్ ఉత్తర భాగం నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కేంద్రం
### తెలంగాణ దశ మారడం ఖాయం
### ఐదు ప్యాకేజీలుగా నిర్మాణం

**మహా :** తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరాన్ని మరింత వేగంగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాంతీయ రింగు రోడ్డు (ట్రిబుల్ ఆర్) ప్రాజెక్టు కీలక దశకు చేరుకుంది. ప్రస్తుతం నగర చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డుకు దాదాపు 40 కిలోమీటర్ల అవతల ఈ భారీ ప్రాజెక్టును నిర్మించనున్నారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే తెలంగాణ రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ భాగాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతాయని

మిగతా 2లో



## తెలంగాణకు కొత్త డీజీపీ..?
### రేసులో ఆ నలుగురు.. ఎవరికి దక్కేనో
### సుప్రీం కోర్టు ఆదేశాలతో ప్యానల్ లిస్టుపై కసరత్తు

**మహా :** తెలంగాణకు త్వరలో కొత్త పోలీస్ బాస్ రానున్నారు. రెగ్యులర్ డీజీపీ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) నియామకం కోసం ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఒక ప్యానెల్ లిస్ట్‌ను సిద్ధం చేస్తోంది. ఈ లిస్ట్‌ను యూపీఎస్సీకి పంపనుంది. డీజీపీల నియామకంపై సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే కొన్ని రాష్ట్రాలు వాటిని అమలు చేయలేదు. దీంతో ఆ రాష్ట్రాలపై కోర్టు ధిక్కరణ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం డీజీపీ పదవి కోసం ప్యానెల్ లిస్ట్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ప్రస్తుత యాక్టింగ్ డీజీపీగా జితేందర్ వ్యవహరిస్తున్నారు. అయితే కొత్త డీజీపీ నియామకంలో సీనియారిటీకి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మొత్తం నలుగురు సీనియర్ అధికారులు రేసులో ఉన్నారు. రవి గుప్తా, సీవీ ఆనంద్, బి. శివధర్ రెడ్డి, సౌమ్య మిశ్రా పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుత యాక్టింగ్ డీజీపీ జితేందర్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. అయితే ఆయనకు ఇంకా ఐదు నెలల సర్వీస్ మాత్రమే ఉంది. రవి గుప్తా ప్రస్తుతం హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉన్నారు. ఆయన 1990 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి కాగా.. గతంలో 2023 డిసెంబర్ నుండి 2024 జులై వరకు డీజీపీగా పనిచేశారు. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న శివధర్ రెడ్డి 1994 బ్యాచ్ అధికారి. ఆయన వచ్చే ఏడాది డిసెంబర్‌లో రిటైర్ కానున్నారు.

మిగతా 2లో



## ఆయన రానివ్వడం ఏంది... ఎప్పుడో వచ్చాం

- అహ్మదాబాద్ లో సీఎం రేవంత్ వ్యాఖ్యలపై ఎంపీ రఘునందన్ రావు
- ఈ రాష్ట్రానికి కాంగ్రెస్ చివరి సీఎం రేవంత్ రెడ్డి అని వ్యాఖ్య



(మొదటిపేజీ తరువాయి)

గతంలో రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి ఎంపీ స్థానాన్ని బీజేపీ దక్కించుకుంది. కామారెడ్డిలో రేవంత్ ను యోడించింది బీజేపీ, రేవంత్ రెడ్డి స్వంత జిల్లా మహబూబ్ నగర్ ఎంపీ స్థానంలో బీజేపీ గెలిచింది. రేవంత్ ఇంచార్జీగా ఉన్న చేవెళ్ళ స్థానంలో బీజేపీ గెలిచింది, ఇవన్నీ చూస్తుంటే బీజేపీని రానివ్వమంటే ఎవరు నమ్ముతారన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల ముందు ఆ మాత్రం మాట్లాడకపోతే తన స్ట్రేచర్ ఏం ఉంటుందన్న ఉద్దేశ్యంతో రేవంత్ రెడ్డి అలా మాట్లాడి ఉంటారని, వాస్తవం ఏమిచన్నది ఆయనకూ, ఆ పార్టీ అగ్రనేతకు కూడా తెలుసన్నారు.

## ఐఏఎస్ రోనాల్డ్ రాస్‌కు క్యాట్‌లో ఊరట

### ఏపీకి కాదు తెలంగాణలోనే



**మహా :** సీనియర్ ఐఏఎస్ అధికారి రోనాల్డ్ రోస్‌కు కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) పెద్ద ఊరట ఇచ్చింది. రాష్ట్ర విభజన సమయంలో ఆయనను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించినప్పటికీ, ప్రస్తుతం ఆయన తెలంగాణలోనే కొనసాగేలా అవకాశం కల్పిస్తూ క్యాట్ కీలక ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విభజన అనంతరం కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ (డీవోపీటీ) రోనాల్డ్ రోస్‌ను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించింది. ఆ ఆదేశాలకు అనుగుణంగా ఆయన ఏపీలో రిపోర్ట్ చేసినా, తర్వాత కొన్ని కారణాలతో మళ్లీ తెలంగాణకు రాగా, తిరిగి ఇటీవల తన బదిలీపై రోనాల్డ్ క్యాట్‌ను ఆశ్రయించారు. తనకు తెలంగాణ రాష్ట్రంలో సేవల కొనసాగింపునకు అవకాశం కల్పించాలని, డీవోపీటీని ఆదేశించాలని కోరుతూ రెండోసారి క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారించిన ట్రైబ్యునల్ తాజాగా రోనాల్డ్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. రాష్ట్ర విభజన సమయంలో జరిగిన నిబంధనలను పరిశీలించిన అనంతరం, రోనాల్డ్ రోస్‌కు తెలంగాణలో కొనసాగేందుకు అనుమతినిచ్చేలా డీవోపీటీకి ట్రైబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది. దీని ద్వారా రోనాల్డ్ రోస్‌కు సర్వీసులో కొనసాగే మార్గం సులభమైంది. ఈ పరిణామం ప్రస్తుతం తెలంగాణ పాలన వ్యవస్థలో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. విభజన తర్వాత ఐఏఎస్, ఐపీఎస్‌ల కేటాయింపులు అనేక వివాదాలకు దారి తీసిన సందర్భంలో, ఈ కేసు మరో మలుపు తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# తెలంగాణలో బీజేపీని ఖతం చేస్తాం

## కాస్కో బీజేపీ

### రాహుల్ సమక్షంలో రేవంత్ పవర్‌ఫుల్ స్పీచ్

### గాంధీ పరివార్‌కు, గాడ్సే పరివార్‌కు మధ్య రాజకీయ పోరాటం

### రాహుల్ గాంధీ గ్యారంటీ అంటే కచ్చితంగా అమలయ్యే గ్యారంటీ

### ఏఐసీసీ సమావేశాల్లో సీఎం ప్రసంగానికి ప్రశంసలు

*"గాంధీ పరివార్‌కు, గాడ్సే పరివార్‌కు మధ్య జరుగుతున్న రాజకీయ పోరాటంలో గెలుపు గాంధేయవాదులదేనని తెలంగాణ ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న ఏఐసీసీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీని ఖతం చేయడమే తమ లక్ష్యమన్నారు. గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ పుట్టిన గడ్డపై సీడబ్ల్యూసీ సమావేశాలు జరిగాయని, ఇక్కడి సమావేశాల స్ఫూర్తితో తిరిగి తెలంగాణకు వెళ్లి బీజేపీని ఖతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. మోదీ గ్యారంటీలతో దేశ ప్రజలను బీజేపీ మోసం చేస్తోందని విమర్శించారు. మణిపూర్‌లో అశాంతి, ఢిల్లీలో రైతుల ఆందోళనపై మోదీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ మాట ఇస్తే అమలు చేసి తీరుతామన్నారు. రాహుల్ గాంధీ గ్యారంటీ అంటే కచ్చితంగా అమలయ్యే గ్యారంటీ అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.* - మహా, అహ్మదాబాద్





అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే రైతులకు రుణమాఫీ చేసినట్లు వెల్లడించారు. మోదీ, బీజేపీ నేతలు గాడ్సే సిద్ధాంతాన్ని ప్రోత్సహిస్తున్నారని సంచలన కామెంట్స్ చేశారు. గాంధీ విధానాలకు వ్యతిరేకంగా మోదీ పనిచేస్తున్నారని మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణలో బీజేపీని అడుగు పెట్టనివ్వమని అన్నారు. గతంలో బ్రిటీష్ వాళ్లను దేశం నుంచి తరిమి కొట్టినట్లే బీజేపీని సైతం తరిమి కొట్టాలన్నారు. ఆ రోజులు దగ్గరలోనే ఉన్నాయని హాట్ కామెంట్స్ చేశారు. దేశంలోని గాంధేయవాదులంతా ఏకమై బీజేపీ పని పట్టాలన్నారు. బీజేపీ ఈ దేశానికి ప్రమాదకరమని.. ఎంత త్వరగా తరిమిస్తే అంత మంచిదని సీఎం రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తెచ్చారని, వాటికి వ్యతిరేకంగా రైతులు 14 నుంచి 15 నెలలు ధర్నాలు చేసినా చర్చలకు రాలేదన్నారు. మణిపూర్‌లో మంటలు రాజేశారని. దేశ మూల వాసుల జీవన హక్కును కాలరాసే ప్రయత్నం మోదీ చేస్తున్నారని విరుచుకుపడ్డారు. మరో వైపు, కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ గాంధీ నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారని, కుల గణన, రైతు రుణ మాఫీ, యువతకు ఉద్యోగాల కల్పన, మహిళల సంక్షేమంపై ఆయన వాగ్దానాలు చేశారన్నారు. పాదయాత్రలో భాగంగా తెలంగాణకు వచ్చినప్పుడు కుల గణన, రైతు రుణమాఫీ, నిరుద్యోగ నిర్మూలన, మహిళల సంక్షేమానికి రాహుల్ గాంధీ హామీలు ఇచ్చారని, రాహుల్ గాంధీ వాగ్దానం మేరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే 25 లక్షల కుటుంబాలకు రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేశామని తెలిపారు.

మేం తెలంగాణలో కుల గణన చేసి చూపించాం, కుల గణనపై రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడాతారనే భయంతో ఆయనకు లోక్‌సభలో మోదీ మైక్ ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోదీ హామీ ఇచ్చారని,. పదకొండు సంవత్సరాలు దాటిపోయింది, ఈ లెక్కన 20 కోట్లకు పైగా ఉద్యోగాలు ఇవ్వాలని ఖాళీ యువతకు ఉద్యోగాలు రాకపోగా మోదీ, అమిత్ షాకు ఇద్దరికే ఉద్యోగాలు వచ్చాయన్నారు. దేశంలోని మూలమూలన ఉన్న గాంధేయవాదులు మోదీ వ్యతిరేక పోరాటంలో రాహుల్‌గాంధీకి అండగా నిలవాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గాంధీ ఆలోచనధారతో ఉన్న మనమంతా గాడ్సే వారసులను, మోదీని ఓడించాలని పిలుపునిచ్చారు. రైతులు, యువత, మహిళల కోసం సీడబ్ల్యూసీలో సాగిన చర్చలపై ఆశతో నేను ఇక్కడి నుంచి వెనక్కు వెళుతున్నానని, తెలంగాణలో మేం బీజేపీకి అవకాశం ఇవ్వం... గుజరాత్ గడ్డపై నుంచి నేను చెబుతున్నా.. మేం నిజాం ప్రభుత్వం కింద ఉన్నప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో వల్లభభాయ్ పటేల్ నేతృత్వంలో మాకు స్వాతంత్ర్యం వచ్చింది. అందుకే గుజరాత్ ప్రజలతో, వల్లభాయ్ పటేల్ వారసులతో మా తెలంగాణ ప్రజలకు సంబంధం ఉందన్నారు. మాకు స్వాతంత్ర్యం ప్రసాదించిన వల్లభాయ్ పటేల్‌తో మాకు హృదయపూర్వకమైన బంధం ఉందని, మాకు స్వాతంత్ర్యం వల్లభాయ్ పటేల్ ఇస్తే తెలంగాణను మాకు సోనియా గాంధీ అందించిందన్నారు. వల్లభాయ్ పటేల్ భూమి నుంచి నేను ఒక్కటే చెబుతున్నా... సోనియా గాంధీ నాయకత్వంలో మేం బీజేపీని తెలంగాణలో అడుగుపెట్టనివ్వం. బీజేపీని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. గాంధీజీ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దండి సత్యాగ్రహంతో పాటు 30 ఏళ్ల పాటు అనేక పోరాటాలు చేశారు .కానీ బ్రిటిష్‌వాళ్లు ఎప్పుడూ గాంధీజీ మీద లాఠీ ప్రయోగం చేయలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన ఆరు నెలల్లోనే గాడ్సే వారసులు గాంధీజీపై తుటా పేల్చి ఆయనను హత్య చేశారంటూ బ్రిటిషర్ల కంటే బీజేపీ నాయకులు ప్రమాదకారులు, బ్రిటిషర్లను దేశం నుంచి తరిమికొట్టినట్లే రాహుల్ గాంధీ నాయకత్వంలో మనమంతా బీజేపీని దేశం నుంచి తరిమికొట్టాలన్నారు. మోదీకి వ్యతిరేకంగా పోరాడేందుకు మనమంతా సిద్ధంగా ఉండాలని, తెలంగాణలో బీజేపీని అడ్డుకునేందుకు, ఓడించేందుకు మేం ఇక్కడి నుంచి ఆశను, ఆదేశాన్ని తీసుకొని వెళుతున్నామన్నారు. రానున్న రోజుల్లో బీజేపీని ఓడించే బాధ్యతను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, గాంధీ వారసులు ఇక్కడి నుంచి తీసుకొని వెళ్లాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అధికారం చేపట్టిన తర్వాత దేశంలో మోదీ చేస్తున్న విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసేందుకు సబర్మతీ ఒడ్డున మనం ఇక్కడ సమావేశమయ్యామని, గాంధీజీ ఆలోచనలకు అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో మనం ప్రయత్నిస్తున్నామన్నారు. గాడ్సే ఆలోచన విధానాన్ని దేశంలో వ్యాపింపజేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.


## తెలంగాణకు కొత్త డీజీపీ..?

(మొదటిపేజీ తరువాయి)

సీవీ ఆనంద్ 1991 బ్యాచ్‌కు చెందిన అధికారి కాగా.. ప్రస్తుతం హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. సీవీ ఆనంద్ 2027 డిసెంబర్‌లో రిటైర్ కానున్నారు. ఈ ఇద్దరి పేర్లను కూడా ప్రభుత్వం ప్యానెల్ లిస్ట్‌లో చేర్చనున్నట్లు తెలుస్తోంది. సౌమ్య మిశ్రా, శిఖా గోయల్‌తో పాటు ఏడీజీలు మహేశ్ మురళీధర్ భగవత్, సజ్జనార్, స్టీఫెన్ రవీంద్ర పేర్లు కూడా వినిపిస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం డీజీ కేడర్‌లోని సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపాల్సి ఉంటుంది. యూపీఎస్సీ ముగ్గురు అధికారుల ప్యానెల్‌ను సిఫారసు చేస్తుంది. వారిలో ఒకరిని డీజీపీగా నియమించాలి. డీజీపీగా నియమితులయ్యే అధికారికి కనీసం 30 ఏళ్ల సర్వీసు ఉండాలి. డీజీ లేదా ఏడీజీ ర్యాంక్ కలిగి ఉండాలి. కనీసం ఆరు నెలల సర్వీసు మిగిలి ఉండాలి. డీజీపీల నియామకంపై సుప్రీంకోర్టు ఈ ఏడాది జనవరిలో ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన బెంచ్ కీలక తీర్పు ఇచ్చింది. ఈ ఉత్తర్వుల్లో సుప్రీంకోర్టు ఎనిమిది రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. తెలంగాణతో పాటు ఏపీ, పంజాబ్, బీహార్, ఒడిశా, కేరళ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. డీజీపీల నియామకంలో కోర్టు ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో వివరణ ఇవ్వాలని కోరింది. అలాగే ఈ రాష్ట్రాలు తమ డీజీపీ నియామక ప్రక్రియలో 2006 తీర్పును ఎలా పాటించాయో వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించింది. రాష్ట్రాలు తమ రాజకీయ అవసరాల కోసం డీజీపీ నియామకాలను వాడుకోవడం సరికాదని కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తెలంగాణకు యాక్టింగ్ డీజీపీగా జితేందర్ ఉండగా ఆయన స్థానంలో పూర్తి స్థాయి డీజీపీ నియామకానికి ప్రభుత్వం సిద్ధమైంది. రేసులో రవి గుప్తా, శిశిధర్ రెడ్డి, సీవీ ఆనంద్, సౌమ్య మిశ్రా ఉండగా.. ఆ నలుగురిలో ఛాన్స్ ఎవరికి దక్కుతుందో వేచి చూడాలి మరి.

## ట్రిబుల్ ఆర్ ఉత్తర భాగం నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కేంద్రం

### తెలంగాణ దశ మారడం ఖాయం ఐదు ప్యాకేజీలుగా నిర్మాణం



(మొదటిపేజీ తరువాయి)

నిపుణులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టును ఉత్తర , దక్షిణ భాగాలుగా విభజించి నిర్మిస్తుండగా ఇప్పటికే ఉత్తర భాగానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి హోదాను మంజూరు చేసింది. ఇటీవల.. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం నిర్మాణానికి సంబంధించిన అటవీ శాఖ అనుమతులను కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ మంజూరు చేసింది. అటవీ సంరక్షణ చట్టం ప్రకారం రీజినల్ ఎంపవర్డ్ కమిటీ (ఆర్ఈసీ) ఈ అనుమతులను జారీ చేసింది. దీనికి కొనసాగింపుగా తాజాగా కేంద్ర క్యాబినెట్ కూడా ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి పూర్తి స్థాయి అనుమతులు మంజూరు చేస్తూ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రక్రియ అతి త్వరలోనే ప్రారంభం కానుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టు పక్కల ఉన్న పట్టణాలు, గ్రామాలు అభివృద్ధికి ఇది ఒక వరంలా మారనుంది. ట్రిబుల్ ఆర్ ఉత్తర భాగం నిర్మాణం మొత్తం ఐదు ప్రత్యేక ప్యాకేజీల ద్వారా చేపట్టనున్నారు. ప్రతిష్ఠాత్మక భారత్‌మాల పరియోజన కార్యక్రమంలో భాగంగా నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్ హెచ్ఏఐ) ఈ కీలకమైన రహదారిని నిర్మించనుంది. ఈ రహదారి సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల గుండా వెళుతుంది. ఈ రహదారి డిజైన్‌ను రోడ్లు, భవనాల శాఖలోని నేషనల్ హైవేస్ (ఎన్ హెచ్) డివిజన్ అందించిన ముఖ్యమైన సమాచారం, సిఫార్సుల ఆధారంగా రూపొందించారు. భవిష్యత్తులో ఈ ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ రహదారిని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించనున్నారు. ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణంలో ఉత్తర భాగం పూర్తి బాధ్యతను కేంద్ర ప్రభుత్వమే తీసుకోనుంది. ఉత్తర భాగాన్ని సంగారెడ్డి నుండి ప్రారంభించి తూప్రాన్, గజ్వేల్ మీదుగా చౌటుప్పల్ వరకు మొత్తం 161 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. ఈ భారీ రహదారిని మొత్తం ఆరు ప్రత్యేక ప్యాకేజీలలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నిర్మాణం కోసం దాదాపు 1,940 హెక్టార్ల భూమి అవసరం అవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. భూసేకరణ ప్రక్రియ కూడా వేగంగా జరుగుతోంది. ఉత్తర భాగం మొత్తం పొడవు 161.518 కిలోమీటర్లుగా నిర్ణయించబడింది. ఈ ప్రతిష్ఠాత్మకమైన ఆర్ఆర్ఆర్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 7,104.06 కోట్ల భారీ మొత్తాన్ని మంజూరు చేసింది. ఈ రహదారి డిజైన్‌ను రోడ్లు, భవనాల శాఖ నేషనల్ హైవేస్ డివిజన్ నిపుణుల సలహాలు , సూచనలు తీసుకున్న తర్వాత ఖరారు చేశారు. ముఖ్యంగా.. ఔటర్ రింగు రోడ్డుతో పాటు వివిధ జాతీయ రహదారులు, ఇతర ముఖ్యమైన జిల్లా కేంద్రాలకు వెళ్లే మార్గాలను దృష్టిలో ఉంచుకుని వ్యూహాత్మక ప్రదేశాలలో ఇంటర్‌ఛేంజ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రయాణికుల సౌకర్యం కోసం టోల్ ప్లాజాలు, విశ్రాంతి గదులు, సర్వీస్ రోడ్లు, బస్ బేలు , ట్రక్ బేలతో పాటు మొత్తం 11 అత్యాధునిక ఇంటర్‌ఛేంజ్‌లను నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ ఆర్ఆర్ఆర్ నాలుగు లేన్ల రహదారిగా నిర్మించబడుతున్నప్పటికీ.. భవిష్యత్తులో ట్రాఫిక్ పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని దీనిని ఆరు లేదా ఎనిమిది లేన్‌లకు విస్తరించే ప్రతిపాదనలు కూడా పరిశీలనలో ఉన్నాయి.

## సినీ నటుడు మోహన్ బాబుకు గట్టి దెబ్బ

### అనుకూలంగా ఇచ్చిన తీర్పును కొట్టి వేసిన కోర్టు

### తప్పుడు సాక్ష్యాలను సమర్పించారన్న మనోజ్.. ఏకీభవించిన కోర్టు

**మహా :** ఎల్ బీ నగర్ కోర్టులో ప్రముఖ నటుడు మోహన్ బాబుకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. జల్‌పల్లిలోని ఇంటి వివాదం కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో గతంలో మోహన్ బాబుకు అనుకూలంగా తీర్పు లభించినప్పటికీ, తాజాగా ఎల్బీ నగర్ కోర్టు ఆ తీర్పును కొట్టివేసింది. ఈ నిర్ణయంతో ఈ వివాదం మరోసారి వార్తల్లో నిలిచింది. జలపల్లిలోని ఒక ఇంటికి సంబంధించిన ఆస్తి తగాదా విషయంలో మోహన్ బాబు గతంలో కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో కోర్టు మోహన్ బాబు వాదనలను అంగీకరించి, ఆయనకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే, ఈ వ్యవహారంలో కొత్త సాక్ష్యాలు, ఆధారాలు బయటకు రావడంతో కేసు మళ్లీ తెరపైకి వచ్చింది.

మోహన్ బాబు తరపున కేసు వాదిస్తున్న వారికి వ్యతిరేకంగా మనోజ్ తరపు న్యాయవాది కొన్ని కీలక ఆధారాలను కోర్టు ముందు ప్రవేశపెట్టారు. కోర్టును తప్పుదోవ పట్టించే విధంగా మోహన్ బాబు తరపు న్యాయవాదులు వ్యవహరించారని, దీనికి సంబంధించిన సాక్ష్యాలను సమర్పించారని మనోజ్ తరపు న్యాయవాది వాదించారు. ఈ ఆధారాలను పరిశీలించిన ఎల్బీ నగర్ కోర్టు, గతంలో ఇచ్చిన తీర్పును పునః పరిశీలనకు తీసుకుంది. ఈ కేసుపై మంగళవారం (ఏప్రిల్ 8, 2025) జరిగిన విచారణలో, ఎల్బీ నగర్ కోర్టు గతంలో మోహన్ బాబుకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. కోర్టుకు సమర్పించిన



కొత్త ఆధారాలు, సాక్ష్యాలు ఈ నిర్ణయానికి కారణమని తెలుస్తోంది. ఈ తీర్పుతో మోహన్ బాబుకు ఊహించని ఎదురుదెబ్బ తగిలినట్లు అయింది. ఈ కేసులో మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, తప్పిదానికి పాల్పడిన ఒక కోర్ట్ క్లర్క్‌పై ఎల్బీ నగర్ కోర్టు చర్యలు తీసుకుంది. కేసు వివరాలను సరిగ్గా నమోదు చేయకపోవడం లేదా తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరించడం వంటి అంశాలపై ఆ క్లర్క్‌కు మెమో జారీ చేసినట్లు సమాచారం. మోహన్ బాబు తరపు న్యాయవాదులు ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఉన్నత కోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో, మనోజ్ తరపు వారు కేసును మరింత బలోపేతం చేసేందుకు అదనపు ఆధారాలను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

## మీ పార్టీ కరోనా కంటే డేంజర్

### అధికారంలోకి పక్కా వస్తం

### రేవంత్‌కు బండి సంజయ్ కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

ఎయిర్‌పోర్టులు, గనులు, సిమెంట్, స్టీల్ సహా కీలక పరిశ్రమలన్నీ ఓ పారిశ్రామికవేత్తకే కట్టబెడుతున్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో భాజపా అక్రమాల ద్వారా గెలిచింది. ఆర్ఎస్ఎస్, భాజపా రోజూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూనే ఉన్నాయి. దేశంలో కులగణన చేపట్టాలని ప్రధాని మోదీని కోరాం. దీనికి ప్రధాని సహా ఆర్ఎస్ఎస్ తిరస్కరించింది. లౌకిక భావనకు ఆర్ఎస్ఎస్ వ్యతిరేకం. దళితుడైన రాజస్థాన్ పీసీసీ నేతను ఆలయానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. వక్ఫ్ సవరణ చట్టం మత స్వేచ్ఛపై దాడి'' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఆయన మాజీ పార్లమెంట్ స్థానం మల్కాజ్‌గిరిలో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఉన్నారు. కామారెడ్డిలో కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఇద్దరిని ఓడించింది కూడా బీజేపీ అనే విషయం రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాషాయ పార్టీకి ప్రజలు ఇచ్చిన తీర్పు రేవంత్‌కు కనువిప్పు కలగాలని అన్నారు. బీజేపీని అడ్డుకుంటామంటూ ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదమని కౌంటర్ ఇచ్చారు.. రేవంత్‌రెడ్డి పగటి కలలు కనడం ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. హైదరాబాద్‌ను మజ్లిస్ చేతిలో పెట్టేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని ఆరోపించారు. దేశభక్తి పార్టీని బ్రిటీషర్లతో పోలుస్తావా అని ధ్వజమెత్తారు. మిగిలిన రెండు రాష్ట్రాల్లోనైనా కాంగ్రెస్‌ను కాపాడుకుంటే మంచిదని హితవు పలికారు. ఈ మేరకు బుధవారం నాడు బండి సంజయ్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు.



## రాష్ట్ర ప్రభుత్వంపై సీపీ సీవీ ఆనంద్ ప్రశంసలు

### యంగ్ ఇండియా స్కూల్ ప్రారంభంపై హర్షం

**మహా :** రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో గురువారం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్న విషయం తెలిసిందే. రేపు ఉదయం 9:45 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభించడం శుభ పరిణామమని సీపీ సీవీ ఆనంద్ కొనియాడారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో తర్వాతి తరానికి క్రమశిక్షణ, నాయకత్వ విలువలు నేర్పించేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

### మాజీ గవర్నర్ తమిళిసై

# ఇంట్లో తీవ్ర విషాదం

## ఆమె తండ్రి అనంతన్ కన్నుమూత.. సంతాపం తెలిపిన సీఎం రేవంత్

**మహా :** తెలంగాణ మాజీ గవర్నర్, తమిళనాడు బీజేపీ కీలక నేత తమిళిసై సౌందరరాజన్ ఇంట్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఆమె తండ్రి శ్రీ కుమారి అనంతన్ (హరికృష్ణన్ నాడార్ అనంతకృష్ణన్) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇవాళ ఉదయం కన్నుమూశారు. తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతగా అనంతన్ గుర్తింపు పొందారు. 2021లో తమిళిసై తల్లి మరణించగా తాజాగా ఆమె తండ్రి కూడా మరణించారు. తండ్రి మృతితో తమిళిసై తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. మృతదేహం ముందు కన్నీటి పర్యంతం అయ్యారు. తన తండ్రిని తట్టి లేపుతూ బోరున ఏడ్చారు. ఈ విషాద ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో బీజేపీ శ్రేణులు, కాంగ్రెస్ నేతలు ఆయన మృతికి సంతాపం తెలుపుతున్నారు. తమిళనాడు సీఎం స్టాలిన్ సహా, పలువురు ప్రముఖులు తమిళిసై నివాసానికి చేరకొని కుమారి అనంతన్ భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

**సీఎం రేవంత్ రెడ్డి సంతాపం**

అనంతన్ మృతిపట్ల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. 'తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గారి తండ్రి, తమిళనాడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గొప్ప సాహితీవేత్త శ్రీ కుమారి అనంతన్ (హరికృష్ణన్ నాడార్ అనంతకృష్ణన్) గారి మరణం దిగ్భ్రాంతి కలిగించింది. మహాత్ముడి సిద్ధాంతాలను పునికిపుచ్చుకున్న దేశ భక్తుడు, తమిళ భాషా ప్రేమికుడు అనంతన్ గారిని కోల్పోవడం ఎంతో బాధాకరం. కుమారి అనంతన్ నాలుగుసార్లు శాసన సభకు, ఒకసారి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై ప్రజలకు ఎన్నో సేవలు అందించారు. తండ్రిని కోల్పోయి దుఃఖంలో ఉన్న తమిళిసై గారికి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేస్తున్నా. అనంతన్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా.' అని సీఎం రేవంత్ ట్వీట్ చేశారు. కాగా, 2019లో తెలంగాణ గవర్నర్‌గా తమిళిసై నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్రానికి గవర్నర్‌గా పనిచేసిన తొలి మహిళ ఆమె. 2021న ఆమె పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. 2024న ఆమె తెలంగాణ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవులకు రాజీనామా చేశారు. అనంతరం అదే ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో చెన్నై దక్షిణ నియోజకవర్గం నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.

# మొయినాబాద్ ఫాంహౌస్‌లో ముజ్రా పార్టీ

## భగ్నం చేసిన ఎస్వోటీ పోలీసులు

### ఏడుగురు యువతులను, 14 మంది యువకుల అరెస్టు.. గంజాయి పట్టివేత

**మహా :** హైదరాబాద్ శివారు మొయినాబాద్‌లో ముజ్రా పార్టీని పోలీసులు భగ్నం చేశారు. ఏడుగురు యువతులు, 14 మంది యువకులను అరెస్ట్ చేశారు. ఎతబర్ పల్లి శివార్లలోని హాలీడే ఫామ్ హౌస్‌లో తెల్లవారుజామున అకస్మాత్తుగా దాడులు చేసిన ఎస్వోటీ పోలీసులు ముజ్రా పార్టీని భగ్నం చేశారు. దాడుల్లో మద్యం బాటిళ్లతో పాటు 70 గ్రాముల గంజాయిని సైతం స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్, ముంబైతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన యువతులను తీసుకొచ్చి ఫాంహౌస్‌లో పాడు పనులు చేయిస్తున్నట్లు గుర్తించారు. వారితో అర్ధనగ్నంగా డాన్సులు చేయించిన్నట్లు తెలిసింది. ఈ మేరకు పార్టీ నిర్వహకులు, ఫాంహౌస్ యజమానులపై కేసులు నమోదు చేశారు. పుట్టినరోజు వేడుకల పేరుతో కొందరు యువకులు ముజ్రా పార్టీ ఏర్పాటు చేసినట్టు పోలీసులు గుర్తించారు. పార్టీ కోసం నిర్వాహకుడు ముంబై నుంచి యువతులను రప్పించినట్టు వెల్లడించారు. ఈ క్రమంలోనే అర్ద నగ్నంగా నృత్యాలు చేస్తున్న అమ్మాయిలు, అబ్బాయిలను అరెస్ట్ చేశారు. అంతే కాకుండా పార్టీలో అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి గంజాయి, హుక్కా పీలుస్తూ ఎంజాయ్ చేస్తున్నట్టు స్పష్టం చేశారు. ముజ్రా పార్టీ జరుగుతుందన్న పక్కా సమాచారంతో ఫామ్‌హౌస్‌పై దాడులు చేశామని ఎస్వోటీ పోలీసులు వివరించారు. ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్‌తో పాటు పెద్ద మొత్తంలో మద్యంను పోలీసులు



స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడి నుంచి మరింత సమాచారం తెలుసుకునేందుకు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో దాడుల్లో భాగంగా.. వారి నుంచి భారీగా మద్యం, హుక్కా, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. యువకులు అందరూ పాత బస్తీకి చెందిన వారీగా పోలీసులు గుర్తించారు. యువతుల్లో ముంబై నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉన్నట్టు సమాచారం.

**ముజ్రా పార్టీ అంటే ....**

ముజ్రా పార్టీ అనేది ఒక రకమైన వినోద కార్యక్రమం. ఇది సాధారణంగా ప్రైవేట్ స్థలాలలో లేదా ఫామ్ హౌస్‌లలో నిర్వహిస్తారు. ఈ పార్టీలలో, కొంతమంది మహిళలు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ అతిథులను అలరిస్తారు. కొన్ని సందర్భాల్లో, ఈ నృత్యాలు అసభ్యకరంగా కూడా ఉంటాయి. ముజ్రా పార్టీలలో మద్యం, ఇతర మత్తు పదార్థాల వినియోగం కూడా ఉండవచ్చు. చాలా సందర్భాలలో, ముజ్రా పార్టీలు చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు కేంద్రంగా మారుతున్నాయి. వీటిలో వ్యభిచారం, మాదకద్రవ్యాల వినియోగం వంటి నేరాలు జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ముజ్రా అనేది చారిత్రాత్మకంగా మొఘల్ కాలంలో ఆస్థానాలలో ప్రదర్శించే ఒక సాంప్రదాయ నృత్య రూపం. అయితే, ఆధునిక కాలంలో ముజ్రా పార్టీలు ఆ సంస్కృతికి భిన్నంగా, కేవలం వినోదం, కొన్నిసార్లు చట్టవిరుద్ధమైన కార్యకలాపాల కోసం ఏర్పాటు చేస్తున్నారు. అందువల్ల పోలీసులు తరచుగా ఇలాంటి పార్టీలపై దాడులు చేస్తూ నిర్వాహకులను, పాల్గొనేవారిని అరెస్టు చేస్తారు.

**డ్రగ్స్ పై ఉక్కుపాదం**

తెలంగాణలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, వినియోగం వంటి వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి రేవంత్ సర్కార్ ప్రత్యేకంగా తెలంగాణ యాంటీనార్కోటిక్స్ బ్యూరో (టీజీన్యాబ్) ఏర్పాటు చేసింది. ఇది పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక కార్యచరణ నిర్వహిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు తరచూ డ్రగ్స్, గంజాయి సరఫరా చేసే ప్రాంతాలపై, అనుమానాస్పద స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా విద్యా సంస్థల పరిసరాల్లో నిఘా పెంచారు. డ్రగ్స్, గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. డ్రగ్స్ కేసుల విచారణను వేగవంతం చేయడానికి ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.

# రేపో రేట్లు తగ్గించిన ఆర్బీఐ

## తగ్గనున్న వాహన, వ్యక్తిగత రుణాల వడ్డీ రేట్లు

### ఆర్బీఐపై మల్హోత్రా మార్క్

### రెండవ త్రైమాసికంలోనూ రేపో రేటు తగ్గింపు

**మహా :** భారత రిజర్వ్ బ్యాంకు బుధవారం దేశ ప్రజలకు మరోమారు తీపి కబురు చెప్పింది. ఇప్పటికే గత త్రైమాసిక సమీక్షలో భాగంగా 3 నెలల క్రితం వడ్డీ రేట్లను తగ్గించిన రిజర్వ్ బ్యాంకు తాజాగా బుధవారం నాటి త్రైమాసిక సమీక్షలోనూ వడ్డీ రేట్లను మరింతగా తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటును గతంలో 0.25 శాతం తగ్గించిన సెంట్రల్ బ్యాంకు ఈ సారి కూడా అదే వైఖరిని కొనసాగించింది. బుధవారం నాటి సమీక్షలో రెపో రేటును 0.25 శాతం మేర తగ్గించింది. ఫలితంగా రెపో రేటు తాజా తగ్గింపు తర్వాత 6 శాతానికి పరిమితమైంది. రెపో రేటు తగ్గితే సాధారణంగా వడ్డీ రేట్లు తగ్గుతాయి కదా. ఇదివరకే ఓ మోస్తరు వడ్డీ రేట్లు తగ్గగా తాజా నిర్ణయంతో ఆ వడ్డీ రేట్లు మరింతగా తగ్గనున్నాయి. ప్రత్యేకించి తాజా రెపో రేటు తగ్గింపు కారణంగా గృహ రుణాల వడ్డీ రేట్లు భారీగానే తగ్గే అవకాశాలున్నట్లు సమాచారం.

ఆర్బీఐ తాజా నిర్ణయంతో గృహ రుణాల వడ్డీ రేట్లు 8 శాతం కంటే దిగివస్తాయన్న విశ్లేషణలు సాగుతున్నాయి. అదే సమయంలో సాధారణ రుణాల వడ్డీ రేట్లలోనూ తగ్గుదల ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రెండు వరుస త్రైమాసికాల్లో రెండు పర్యాయాలు రెపో రేటును 0.25 మేర తగ్గించిన ఆర్బీఐ వడ్డీ రేట్లు దిగి రావడానికి దోహదం చేసిందని చెప్పాలి. మొన్నటిదాకా రిజర్వ్ బ్యాంకు గవర్నర్ గా శక్తికాంత దాస్ కొనసాగి




తే ఆయన గవర్నర్ గా ఉన్నంత కాలం రెపో రేటు దగ్గిన దాఖలానే కనిపించలేదు. దాస్ హయాంలో ఎప్పుడు ఆర్బీఐ త్రైమాసిక సమీక్ష జరిగినా వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు లేదన్న వార్తలే వినిపించాయి. అయితే 3 నెలల క్రితం దాస్ స్థానంలో రాజీవ్ మల్హోత్రా రిజర్వ్ బ్యాంకు గవర్నర్ గా పదవీ బాధ్యతలు చేపట్టారు. వచ్చీ రావడంతోనే తన తొలి త్రైమాసికంలోనే రెపో రేటును 0.25 తగ్గించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసిన మల్హోత్రా తన రెండో త్రైమాసిక సమీక్షలోనూ అదే జోరును కొనసాగించారు. వడ్డీ రేట్లను తగ్గించడం ద్వారా మరింత మేర రుణాలను విడుదల చేస్తూ బ్యాంకులు మరింత మేర ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంది. అదే సమయంలో జనానికి కూడా మరింత మేర రుణాలు అందుబాటులోకి వస్తాయి. వెరసి ఆర్థిక వ్యవస్థ పుంజుకునే అవకాశం ఉంది.

# క్రమశిక్షణ ఉల్లంఘన...?

## రాజాసింగ్ వ్యాఖ్యలపై అధిష్టానం ఆరా

### నివేదిక కోరిన బీజేపీ అధిష్టానం.. మరోసారి సస్పెన్షన్ తప్పదా...!

**మహా :** గత కొంత కాలంగాఎ రాష్ట్ర పార్టీ నేతలపై విమర్శలు గుప్పిస్తున్న గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పై బీజేపీ హైకమాండ్ ఆరా తీయడం ప్రారంభించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లక్ష్యంగా రాజాసింగ్ చేసిన కామెంట్స్ పైన అధిష్టానానికి పలు ఫిర్యాదులు అందాయి. దీంతో, అసలు రాజాసింగ్ వ్యాఖ్యలపై నివేదిక కోరినట్లు సమాచారం. పార్టీలో నిర్ణయాల పైన, చేస్తున్న వ్యాఖ్యలపైన హైకమాండ్ ఆగ్రహంగా ఉందని తెలుస్తోంది. దీంతో, రాజాసింగ్ పైన తమ నిర్ణయం ప్రకటించేందుకు బీజేపీ నాయకత్వం సిద్దమైనట్లు సమాచారం. పార్టీ అధినాయకత్వం క్రమశిక్షణ చర్యలు ప్రకటించేందుకు రంగం సిద్దమైంది. ఇప్పటికే పార్టీ రాష్ట్ర నాయకత్వం నుంచి నివేదిక కోరినట్లు పార్టీ నేతల సమాచారం. రాజాసింగ్ కొంత కాలంగా చేస్తున్న వ్యాఖ్యలు.. చోటు చేసుకుంటున్న పరిణామాల పైన పూర్తి నివేదిక రూపంలో పంపినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. పార్టీలో ఉన్న గ్రూపులు... ఎవరు సీఎంగా ఉంటే వారిని పార్టీలోకి నొందరు నేతలు రహస్యంగా కలుస్తున్నారని రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేసారు. తాజాగా హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గౌతమ్‌రావును ప్రకటించడంపై రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. కేంద్ర మంత్రి.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి లక్ష్యంగా రాజాసింగ్ ఈ వ్యాఖ్యలు చేస్తున్నట్లు భావిస్తున్నారు. తాజడాగా శ్రీరామనవమి ర్యాలీ నేపథ్యంలోనూ నేరుగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని టార్గెట్ గా చేసి రాజాసింగ్ వ్యాఖ్యలు చేశారు. రాజాసింగ్ వ్యాఖ్యల కారణంగా పార్టీ ఇమేజ్ దెబ్బతింటుందని కొందరు నేతలు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీంతో, రాజాసింగ్ పై పార్టీ నాయకత్వం సూచన మేరకు రాష్ట్ర నేతలు నివేదిక పంపారు. ఈ నివేదిక ఆధారంగా హైకమాండ్ చర్యలు తీసుకునే అవకాశం ఉందని భా



విస్తున్నారు. పార్టీ సీనియర్ ఎమ్మెల్యేగా రాజాసింగ్ అసెంబ్లీలో ఫ్లోర్ లీడర్ పదవి ఆశించారు. అయితే, పార్టీ ఏలేటి మహేశ్వర్ రెడ్డిని నియమించారు. అప్పటి నుంచి గుర్రుగా ఉన్న రాజాసింగ్ పార్టీలో పరిణామాల పైన ఓపెన్ గానే మండిపడుతున్నారు. దీంతో, ఇప్పుడు రాజాసింగ్ విషయం లో పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయం పైన ఉత్కంఠ కొనసాగుతోంది.

**గతంలో సస్పెన్షన్ కు గురైన రాజాసింగ్**

హిందూత్వమే తన ఊపిరి అన్నట్లుగా ప్రజల్లో పేరు సంపాదించుకున్న రాజాసింగ్ గతంలోనూ బీజేపీ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం వివాదాస్పద హాస్య నటుడితో హైదరాబాద్ లో షో నిర్వహించింది. ఈ షోకు వ్యతిరేకంగా రాజాసింగ్ చివరి వరకు పోరాటం చేశారు. ఈ సందర్భంగా యొక వర్గాన్ని ఉజద్దేశించి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆగ్రహం వ్యక్తం చేసిన అధిష్టానం రాజాసింగ్ ను సస్పెండ్ చేసింది. 2023 ఎన్నికలకు ముందు సస్పెన్షన్ ను తొలగించిన అధిష్టానం తిరిగి టికెట్ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ నుంచి రాజాసింగ్ ఒక్కరే బీజేపీ తరపున గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత రాజాసింగ్ కొంత కాలం నాయకత్వంతో కలిసి ఉన్నప్పటికీ తదనంతర పరిణామాల నేపథ్యంలో పార్టీ నాయకత్వంపై తిరుగుబాటు వ్యాఖ్యలు చేయడం కాషాయ దళంలో కలకలం రేకెత్తిస్తోంది.

# ఐదు ఎకరాల్లో సీఎం చంద్రబాబు ఇల్లు

## అమరావతిలో శంఖు స్థాపన

**అమరావతి, మహా :** ప్రస్తుతం రాజధాని ప్రాంతంలోని ఉండవల్లిలో అద్దె ఇంట్లో నివసిస్తున్న చంద్రబాబు కుటుంబం అమరావతిలో సొంత ఇల్లు నిర్మించుకోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో గత ఏడాది డిసెంబరులో స్థానిక రైతుల నుంచి ఐదు ఎకరాల భూమిని కొనుగోలు చేసిన సీఎం చంద్రబాబు బుధవారం భూమి పూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. రాజధాని అమరావతితోపాటు తన సొంత ఇంటిని నిర్మించాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. వెలగపూడి సచివాలయం వెనుక భాగాన ఈ9 రోడ్డుకు ఆనుకుని ఆయన సొంత ఇంటిని నిర్మిస్తున్నారు. సుమారు ఐదు ఎకరాల స్థలంలో ఇల్లు కోసం 1,455 చదరపు గజాల స్థలాన్ని కేటాయించారు. జీ ప్లస్ 1లో చంద్రబాబు ఇల్లు నిర్మించనున్నారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసి, ఉండవిల్లిలోని అద్దె ఇంటి నుంచి ఇక్కడి షిఫ్టు అవ్వాలని సీఎం ప్లాన్ చేస్తున్నారు. బుధవారం నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమానికి చంద్రబాబుతోపాటు సతీమణి నారా భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్ హాజరయ్యారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సమీప బంధువులను మాత్రమే ఆహ్వానించారు. కాగా,



చంద్రబాబుకు ఇప్పటికే హైదరాబాద్ లో సొంత ఇల్లు ఉంది. సొంత గ్రామం నారావారిపల్లెలో వారసత్వంగా వచ్చిన ఇంటితోపాటు కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురంలో మరో ఇంటిని సీఎం చంద్రబాబు నిర్మిస్తున్నారు. రాజధానిలో ఇప్పటివరకు సొంత ఇల్లు లేకపోవడంతో ప్రతిపక్షం ఆయనపై విమర్శలు చేసేది. మాజీ సీఎం జగన్ కు రాజధానిలో ఇల్లు ఉందని, సీఎం చంద్రబాబు హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారని ఆరోపించేది. అయితే ఇప్పుడు సొంత ఇంటిని నిర్మించుకోవడం ద్వారా వైసీపీ విమర్శలకు చంద్రబాబు చెక్ చెబుతున్నారని అంటున్నారు.

# దేశానికి తెలంగాణ మార్గం చూపింది

(మొదటిపేజీ తరువాయి)

"చనిపోయాక నా గురించి ప్రజలు ఏం ఆలోచిస్తారనేది అనవసరం. నేను అనుకున్న పనులు పూర్తి చేశాక ప్రజలు మరిచిపోయినా నాకు అభ్యంతరం లేదు. బీసీల రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బిల్లు కేంద్రానికి పంపారు. రేవంత్‌రెడ్డి పంపిన బిల్లుపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. తెలంగాణలో కులగణనను విజయవంతంగా నిర్వహించారు. కులగణన ఆధారంగా రిజర్వేషన్లు పంచేందుకు ప్రయత్నం చేస్తున్నాం. కులగణన వల్ల దేశంలో బీసీల సంఖ్య ఎంతో తెలుస్తుంది. కులగణన విషయంలో తెలంగాణ దేశానికి మార్గం చూపింది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి అంశాన్ని తొలగిస్తాం. తెలంగాణలో 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలే ఉన్నారు. తెలంగాణ సంపదలో మాత్రం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తగిన భాగస్వామ్యం లేదు. వారి జనాభాకు అనుగుణంగా సంపదలోనూ తగిన వాటా అవసరం" అని రాహుల్ గాంధీ అన్నారు. "ప్రభుత్వరంగ సంస్థలను



ప్రధాని మోదీ ఒక్కొక్కటిగా విక్రయిస్తున్నారు. ఇద్దరు వ్యాపారవేత్తలకే వాటిని అప్పగిస్తున్నారు. ఎయిర్‌పోర్టులు, గనులు, సిమెంట్, స్టీల్ సహా కీలక పరిశ్రమలన్నీ ఓ పారిశ్రామికవేత్తకే కట్టబెడుతున్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో భాజపా అక్రమాల ద్వారా గెలిచింది. ఆర్ఎస్ఎస్, భాజపా రోజూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూనే ఉన్నాయి. దేశంలో కులగణన చేపట్టాలని ప్రధాని మోదీని కోరాం. దీనికి ప్రధాని సహా ఆర్ఎస్ఎస్ తిరస్కరించింది. లౌకిక భావనకు ఆర్ఎస్ఎస్ వ్యతిరేకం. దళితుడైన రాజస్థాన్ పీసీసీ నేతను ఆలయానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. వక్ఫ్ సవరణ చట్టం మత స్వేచ్ఛపై దాడి" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

# పెట్రోల్, గ్యాస్ ధరల పెంపు

## కేంద్రంపై కేటీఆర్ ఆగ్రహం

**హైదరాబాద్, మహా:** కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, గ్యాస్ ధరల పెంపు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెరుగుదల సామాన్య ప్రజల జీవనాన్ని దుర్భరం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్థాన్ వంటి దేశాలతో పోలిస్తే మన దేశంలోనే పెట్రోల్ ధరలు అధికంగా ఉండటం శోచనీయమని అన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి కేటీఆర్ లేఖ రాశారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ధరలను తగ్గించకపోవడం విమర్శలకు తావిస్తోందని అన్నారు. కేంద్రం విధిస్తోన్న సెస్సుల కారణంగా రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. 'మినిమం



గవర్నమెంట్, మ్యాగ్జిమమ్ గవర్నెన్స్' అనేది కేవలం నినాదంగా మిగిలిపోయిందని, 'మ్యాగ్జిమమ్ ట్యాక్సేషన్, మినిమమ్ రిలీఫ్' అన్న చందంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన ఎద్దేవా చేశారు.

# ఇంకా 30 రోజులే మిగిలింది!

## ప్రపంచ అందాల పోటీలపై స్మితా సభర్వాల్ ఆసక్తికర ట్వీట్

### ఆతిథ్యం అంటే తెలంగాణ అనేలా ఏర్పాట్లు



**మహా:** మిస్ వరల్డ్ 2025 పోటీల వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు తెలంగాణ సర్కారు సిద్ధమైంది. మే 7 నుంచి 31 వరకు 72వ మిస్ వరల్డ్ పోటీలు తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా, రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆతిథ్యమంటే తెలంగాణ అనేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే స్మితా సబర్వాల్ బుధవారం ఎక్స్ వేదికగా ఆసక్తికర ట్వీట్ చేశారు. 'మిస్‌వరల్డ్ పోటీల నేపథ్యంలో కొన్ని రోజులు నాకు ఉత్తమ ఉద్యోగం ఉన్నట్లు అనిపిస్తుంది. హైదరాబాద్‌లోని చౌమహల్లా ప్యాలెస్ వద్ద మిస్‌వరల్డ్2025 ఈవెంట్ కోసం మా టీమ్‌ను వెల్కమ్ గాలా డిన్నర్ కోసం సిద్ధం చేస్తున్నాను. గ్రాండ్ ఓపెనింగ్ వేడుకలకు ఇంకా 30 రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో అందరూ సిద్ధంగా ఉన్నారు' అని ఫోటోలు షేర్ చేశారు. కాగా, మిస్‌వరల్డ్ పోటీలో పాల్గొనే వారు మే 6, 7న హైదరాబాద్‌కు రానున్నారు. కాగా, తెలంగాణ టూరిజం బ్రాండ్ ఇమేజ్ పెరిగేలా చార్మినార్ కట్టడం వద్ద హెరిజేజ్ వాక్, చౌమహల్లా ప్యాలెస్‌లో వెల్కమ్ డిన్నర్ ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఇది ఆస్తి గొడవ కాదు

## ఆ ఇంట్లో నా వస్తువులు ఉన్నాయి

## ఎందుకు అనుమతించరు ?: మంచు మనోజ్

**మహా :** ఫ్యామిలీ గొడవలతో మోహన్‌బాబు కుటుంబం మరోసారి వార్తల్లో నిలిచింది. మంగళవారం తన కారు పోయిందని పోలీసులను ఆశ్రయించిన మంచు మనోజ్ ఇదంతా తన సోదరుడు మంచు విష్ణు చేయిస్తున్నాడంటూ ఆరోపించారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం జల్‌పల్లిలోని మోహన్ బాబు ఇంటి వద్దకు చేరుకున్న ఆయన గేటు బయట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంచు మనోజ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమది ఆస్తి గొడవ కాదన్నారు. తన జుట్టు విష్ణు చేతుల్లో పెట్టేందుకు ఇలా చేస్తున్నారని ఆరోపించారు. ఇంట్లో తన పెంపుడు జంతువులు, వస్తువులు ఉన్నాయని, వాటి కోసమే ఇక్కడికి వచ్చానని తెలిపారు. తనకు ఈ ఆస్తి వద్దని ఎప్పుడో తండ్రికి చెప్పానని, ఇది ఆస్తి గొడవ కాదని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఇదంతా అన్నారు. అక్కడే ఈ గొడవ మొదలైందని తెలిపారు. డిసెంబర్ నుంచి గొడవలు జరుగుతున్నా పోలీసులు ఇప్పటి వరకూ ఛార్జ్‌షీట్ నమోదు చేయలేదని మనోజ్ వాపోయారు. ఇక ఈ నెల 1న పాప పుట్టినరోజు సందర్భంగా రాజస్థాన్ కు వెళ్లిన తర్వాత విష్ణు ప్లాన్ చేసి




ఇదంతా చేశారని ఆరోపించారు. తెల్లవారుజామున విష్ణు అనుచరులు వచ్చి కార్లను తీసుకెళ్లడంతో పాటు తన సెక్యూరిటీపై దాడి చేశారని మనోజ్ తెలిపారు. కమిషనర్ ఇచ్చిన బైండోవర్‌ను వాళ్లు ఎన్నోసార్లు దాటారని, దొంగతనం గురించి చెప్పినా పోలీసులు ఎలాంటి యాక్షన్ తీసుకోవడం లేదన్నారు. ఇప్పుడు తన ఇంట్లోకి తాను వెళ్లడానికి అనుమతి కావాలని పోలీసులు అడుగుతున్నారని, మోహన్‌బాబు చెబితేనే లోపలికి పంపిస్తామంటున్నారని మనోజ్ తెలిపారు. కోర్టు నోటీసులతో వచ్చినా లోపలికి పంపించడం లేదని, తన సమస్యను పరిష్కరించాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి మనోజ్ విజ్ఞప్తి చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన పరిణామం

## ప్రభాకర్ రావు పాస్ పోర్ట్ రద్దు

### నగర పోలీసులకు సమాచారం అందించిన పాస్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా

**మహా :** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఆరవ నిందితుడిగా పోలీసులు ఎఫ్ఐఆర్ లో పేర్కొన్న ఇంటలీజెన్స్ మాజీ ఐజీ ప్రభాకర్ రావు పాస్ పోర్టును భారత ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు పాస్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చింది. ప్రభాకర్ రావు పై ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే రెడ్ కార్నర్ నోటీసులు జారీ అయ్యాయి. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చినప్పటి నుంచి ప్రభాకర్ రావు అమెరికాలోనే ఉంటున్నారు. పాస్ పోర్ట్ ను భారత ప్రభుత్వం రద్దు చేయడంతో అమెరికాలో ప్రభాకర్ రావుకు గ్రీన్ కార్డును నిరాకరించారు. పాస్ పోర్టు రద్దు కావడం, అమెరికా ప్రభుత్వం గ్రీన్ కార్డును నిరాకరించడంతో రాష్ట్ర పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. అమెరికా కాన్సులేట్, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహకారంతో ప్రభాకర్ రావును ఇండియాకు రప్పించేందుకు పోలీసులు స్పీడ్ పెంచారు.



EDITORIAL సంపాదకీయం

# భావ స్వేచ్ఛకు సర్వోన్నత రక్షాకవచం

పౌరుల భావప్రకటనా హక్కుకు మన రాజ్యాంగం హామీ ఇస్తోంది. అయితే, దాన్ని దుర్వినియోగం చేస్తూ విద్వేష వ్యాఖ్యలకు పాల్పడుతున్నారు చాలామంది. వారిని కట్టడి చేయడం ఎంత అవసరమో ప్రజాస్వామ్యబద్ధమైన అసమ్మతిని సహించడం అంతే ప్రధానం. ఇదే విషయాన్ని స్పష్టీకరిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు రక్ష రేక కట్టింది. సుప్రీంకోర్టు ఇటీవల గుజరాత్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా 'సుప్రీం' చేసిన వ్యాఖ్యలు దేశంలోని పోలీసులందరూ తెలుసుకోవాల్సినవి. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గడీపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేస్తూ పౌరుల భావవ్యక్తీకరణ స్వేచ్ఛను చిన్నచిన్న కారణాలు చూపి హరించరాదని కోర్టు స్పష్టీకరించింది. ''ఏ ఖూన్ కే ప్యాసోం బాత్ సున్ఫో ఓ రక్త పిపాసులారా మాట వినండి'' అంటూ ఇమ్రాన్ రాసిన కవిత ఆధారంగా ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అసలు ఈ కవిత నేరపూరితమే కాదని, కేసు పెట్టడానికి ముందు అందులోని మాటల్ని పోలీసులు అర్థం చేసుకోవాలని న్యాయపాలిక హితవుచెప్పింది.



### యాంత్రికంగా ఎఫ్ఐఆర్‌ల నమోదా?

ఇమ్రాన్ ప్రతాప్‌గడీ సోషల్ మీడియాలో ఓ కవితను పోస్టుచేశారు. అది అభ్యంతరకరంగా ఉందంటూ న్యాయవాది దగ్గర గుమాస్తాగా పనిచేసే వ్యక్తి ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వారు తక్షణమే స్పందించి జాతీయ సమైక్యతకు భంగం కలిగించడం, మత భావనలను దెబ్బతీసేలా, ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టేలా మాట్లాడటం వంటి నేరాలు ఆపాదిస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గుజరాత్ హైకోర్టు జనవరి 17న దాన్ని కొట్టేయడానికి నిరాకరించింది. దాంతో అప్పీలుకు వెళ్లగా సుప్రీంకోర్టు భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు భద్రత కల్పించే వ్యాఖ్యలు చేసింది.

మనం గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించి 75 ఏళ్లు దాటాయి. మన సమాజం ఒక కవితా గానం, ఒక స్టాండప్ కామెడీ, మరేదైనా కళారూపం కారణంగా వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు చెలరేగేంత బలహీనమైనది కాదని నమ్ముతున్నాం. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ ఆరోగ్యకరమైన, నాగరిక సమాజంలో భాగం. ఎక్కువ మందికి రుచించదన్న కారణంగా ఈ స్వాతంత్ర్యానికి విఘాతం కలిగించడం సరికాదు. ఆ కవిత సామరస్యాన్ని దెబ్బతీసేలా లేదు. హక్కుల పోరాటంలో అన్యాయం పైచేయి సాధిస్తే ప్రజా స్పందన ఎలా ఉంటుందనేది మాత్రమే ఈ కవిత చెబుతోంది అని న్యాయస్థానం పేర్కొంది. కవితలు, నాటికలు, స్టాండప్ కామెడీ, వ్యంగ్యం వంటి కళారీతుల్ని ఆస్వాదించాలంటూ మార్చి 28న వెలువరించిన తీర్పులో పేర్కొంది. అలాంటి కళారూపాలు వైషమ్యాలకు దారితీస్తాయని నమ్మడం స్వేచ్ఛా సమాజానికి అనివార్యమైన భావవ్యక్తీకరణ స్వాతంత్ర్యానికి గొడ్డలిపెట్టు అని జస్టిస్ ఎ.ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎఫ్ఐఆర్‌లను గుడ్డిగా, యాంత్రికంగా నమోదు చేయకూడదని పోలీసులను ఆదేశించింది.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ 2019లో కర్ణాటకలో చేసిన ప్రసంగం తన మనోభావాలను దెబ్బతీసిందంటూ ఓ నాయకుడు సూరత్ కోర్టుకు వెళ్లాడు. న్యాయస్థానం రెండేళ్ల జైలుశిక్ష విధించడంతో రాహుల్ లోక్‌సభ సభ్యత్వం రద్దయింది. దీనిపై ఆయన హైకోర్టుకు వెళ్లగా, అక్కడా వ్యతిరేకంగానే తీర్పు వచ్చింది. దాంతో సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీ నేరం చేశారని నిర్ధారణకు రావడం సహేతుకం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏ మాత్రం పొంతన, హేతుబద్ధత లేకుండా ఆయనకు అంతటి తీవ్రమైన శిక్ష విధించారంటూ ఆక్షేపించింది.

### అసమ్మతిలో ప్రమాదాన్ని చూడొద్దు

అంతకుముందు 2022లో గుజరాత్‌కు చెందిన శాసనసభ్యుడు జిగ్నేశ్ మేవానీని అక్కడి పాలన్‌పూర్ సర్క్యూట్ హౌస్‌లో అస్సాం పోలీసులు అరెస్టు చేశారు. అభ్యంతరకర ట్వీట్ చేశారన్నది అభియోగం. స్థానిక కోర్టు మేవానీకి బెయిలు మంజూరు చేసినా, అస్సాం పోలీసులు ఇతర కేసుల సాకుతో మళ్లీ అరెస్టు చేశారు. తరవాత ఆయా కేసుల్లోనూ మేవానీకి బెయిల్ వచ్చింది. స్టాండప్ కమేడియన్ కునాల్ కామ్రా విషయంలోనూ అదే జరిగింది. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేపై కామ్రా వ్యాఖ్యలు చేశారన్నది ఆరోపణ. కామ్రా ప్రదర్శన ఇచ్చిన ముంబయిలోని హ్యాబిటట్ స్టూడియోను శిందే వర్గీయులు ధ్వంసం చేశారు. దీనికి బాధ్యులైన శివసేన కార్యకర్తలు బెయిలుపై స్వేచ్ఛగా తిరుగుతున్నారు. తమిళనాడు నివాసి అయిన కునాల్ కామ్రాకు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ స్థానిక హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. ఈ నేపథ్యంలో భావవ్యక్తీకరణ స్వేచ్ఛను పరిరక్షిస్తున్న న్యాయపాలిక చొరవ స్ఫూర్తిదాయకమైంది. భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు వ్యతిరేకంగా క్రిమినల్ చర్యలకు ఉపక్రమించడానికి ముందు పోలీసు వ్యవస్థ, కోర్టులు హేతుబద్ధమైన, బలమైన, స్థిరమైన, ధైర్యంతో కూడుకున్న ప్రమాణాలు పాటించాలి. అంతేగాని, ప్రతి అసమ్మతి భావనలోనూ ప్రమాదాన్ని చూసే బలహీన మనస్తత్వంతో ప్రవర్తించరాద్దు అన్న సుప్రీంకోర్టు నిర్దేశాలు అందరికీ శిరోధార్యమైనవి.

# నైతికతను ప్రత్యేక విషయం చేయాలే..

నేడు సమాజంలో విలువల పతనం కొట్టొచ్చినట్టు స్పష్టంగా కనబడుతోంది. మానవుల్లో నైతిక విలువలు నశించడంతో అనేక దుష్పరిణామాలు సంభవిస్తున్నాయి. మనిషిలో అసూయ, ద్వేషం, స్వార్థం పెరిగిపోయి కుట్రలకు, కుతంత్రాలకు పాల్పడుతున్నారు. దోపిడీ, దొంగతనం, హత్యలు, స్మగ్లింగ్ కిడ్నాప్ మొదలగునవి నిత్య కృత్యమైపోయాయి. కులాల పేరిట, మతాల మాటున ప్రతిరోజు ఏదో ఒక చోట మారణహోమాలు జరుగుతున్నాయి. మానభంగాలు, లైంగిక వేధింపులు భ్రూణ హత్య లాంటి అమానవీయ సంఘటనలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి.తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత విద్యా వ్యవస్థలో లోపాలు, తీసుకురావాల్సిన సంస్కరణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) లో నిర్వహించిన విద్యా కమిషన్ ఉన్నత స్థాయి సమావేశంలో దృష్టి పెట్టడం సంతోషకరమైన పరిణామం. తెలంగాణ రాష్ట్రంలో మెరుగైన విద్యా వ్యవస్థ రూపకల్పనకు సమగ్ర విధాన పత్రం రూపొందించాలని ముఖ్యమంత్రి విద్యా కమిషన్ ను ఆదేశించడం, ఉత్తమ విద్యా వ్యవస్థ ఏర్పాటుకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదని పేర్కొనడం ముఖ్యమంత్రికి విద్యా వ్యవస్థపై ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. ప్రాథమిక దశలో అందే విద్యతోటే పునాది బలపడుతుందని, ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తే ఉన్నత చదువుల్లో విద్యార్థులు మెరుగ్గా రాణించగలరని ముఖ్యమంత్రి అభిప్రాయపడటం అతని ముందు చూపుకు నిదర్శనంగా నిలుస్తోంది.



విలువలతో కూడిన విద్య ద్వారానే ముందు తరాలు మంచి విలువలతో పెరిగి సమాజంలో శాంతి సంక్షేమాలు వెల్లివిరుస్తాయి. భారతదేశంలో ప్రాచీన విద్యా విధానం విద్యార్థులలో విలువలు పెంపొందించడానికి జ్ఞానం, నైపుణ్యం అలవడటానికి ప్రాధాన్యత ఇచ్చింది. ప్రాచీన విద్యా విధానంలో నీతి నియమాలను కేంద్రీకృతం తీసుకొని బోధన కొనసాగింది. నేడు ప్రాథమిక స్థాయి నుంచి కళాశాలల స్థాయి వరకు అనేక విద్యా సంస్థలు విద్యార్థులకు పోటీ ప్రపంచాన్ని అలవాటు చేయాలనే తపనతో నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చి ముందుకు పోతున్నాయి. నేడు మహిళలపై వరుసగా జరుగుతున్న అమానుష ఘటనలు, నేర ప్రవృత్తి, అసాంఘిక కార్యకలాపాలకు విరుగుడుగా నైతిక విలువలను ప్రత్యేక పాఠ్యపుస్తకంగా ప్రాథమిక దశ నుంచి డిగ్రీ స్థాయి వరకు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి, విద్యా కమిషన్ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

దేశంలో పెరుగుతున్న నేరాలు అరికట్టడానికి, ఆధునిక విజ్ఞానం ద్వారా కనిపెట్టడానికి ప్రభుత్వాలు అనేక వ్యయ ప్రయాసలకు గురవుతున్నాయి. నేరాలు జరిగిన తరువాత నేరస్తులను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేయడం, వారిని వివిధ ప్రాంతాలకు పంపించడం ఖర్చు కాలయాపనతో కూడుకున్న పని. అసలు నేరాలు జరగకుండా, నేరస్తులుగా మారకుండా చూడటం వల్ల సమాజానికి సంక్షేమకరంగా ఉంటుంది. చిన్నతనం నుంచి పిల్లలకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా మాత్రమే పిల్లలు ఆదర్శ పౌరులుగా తయారు కాగలరు. విలువల ఆవశ్యకత గురించి బాలలతో సంభాషించడానికి, విలువలు లోపించడం వల్ల వారి జీవితాల్లో ఎదురయ్యే దుష్ఫలితాల గూర్చి చర్చించడానికి వీలుగా పాఠశాలల్లో, కళాశాలల్లో నైతిక విలువల అభివృద్ధి అనేది ఒక భాగం కావాలి.

సమాజంలో పౌరులు తమ జీవితాన్ని ఆదర్శవంతంగా సుఖమయం చేసుకోవడానికి, పవిత్రంగా కొనసాగించడానికి విలువలతో కూడిన విద్య తోడ్పడుతుంది. నైతిక విలువలతో కూడిన విద్య మొత్తం కులం, జాతి వివక్ష, స్త్రీ పురుష భేదాలు మొదలగు అభివృద్ధి నిరోధక భావనలను తుడిచేస్తుంది. నైతిక విలువలు విద్యార్థులకు ఏ ఒక్క రోజు, రెండు రోజుల బోధనలతోనో, అతిథి మేధావుల ఉపన్యాసాలతోనో అలవడవు. బాల్యం నుంచి విద్యార్థి దశ పూర్తయ్యే వరకు నిరంతరం రోజువారి బోధనలో సత్ప్రవర్తన పెంపొందించేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి తరగతికి ప్రత్యేక పాఠ్య పుస్తకం ద్వారానే విలువలతో కూడిన విద్యాబోధనకు మార్గమేర్పడి ఇతరులను గౌరవించడం, ఓర్పు, సహనం, సత్యం, ప్రేమ, శాంతి, ఐక్యమత్యం, నడవడిక, సహకార భావన, నిజాయితీ మొదలగు సంక్షేమ భావనలు పెంపొందుతాయి. దీని ద్వారా సమాజంలో ప్రశాంతత నెలకొని అభివృద్ధికి బాటలు పడతాయి.విద్యారంగంలో విలువల పతనం సామాజిక వ్యవస్థ అంతటికి మచ్చ తెస్తోంది. కొంతమంది విద్యార్థుల అనుచిత ప్రవర్తన నైతిక విలువలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. నేటి ఆధునిక కాలంలో విద్యా విధానంలో వస్తున్న మార్పులు, విద్యాసంస్థల మధ్య వెర్రి తలలు వేస్తున్న వ్యాపార పోటీ తత్వ ధోరణి బాలలను మార్కులు, ర్యాంకుల చుట్టూ మాత్రమే పరిభ్రమించేటట్లు చేస్తోన్నది. కార్పోరేటు పాఠశాలలు, కళాశాలలు, అందమైన బ్రోచర్లు, హోర్డింగులు, కరపత్రాల ద్వారా తాము సాధించిన మార్కులు, ర్యాంకులు, ఐఐటీ సీట్లను ప్రామాణికం చేస్తూ తాటికాయంత అక్షరాలతో ఆర్భాటంగా ప్రచారం చేయడాన్ని ప్రాధాన్యత చేసుకుంటున్నాయి. పాఠశాలల్లో విలువలు, నీతి నియమాలు నేర్పించడానికి అవసరమైన సమయాన్ని కేటాయిస్తామని, విద్యార్థులు మంచి ఆదర్శ పౌరులుగా రూపుదిద్దుతామని చెప్పే ఏ ఒక్క పాఠశాల, కళాశాల లేదంటే అతిశయోక్తి లేదు.

కార్పొరేట్ చదువుల పుణ్యమా అని విద్యార్థులు చదువుల చట్రంలో ఊపిరి సలపనంతటి ఒత్తిడిలో కూరుకుపోతున్నారు. విద్య పేరిట పక్కా వ్యాపారం చేస్తున్న పాఠశాలలు, కళాశాలలు దేశంలో లెక్కలేనన్ని ఉన్నాయి. ఇవి ర్యాంకుల కోసం విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నాయి. యాజమాన్యాలకు అండగా తల్లిదండ్రులు కూడ తోడవడంతో విద్యార్థులు తట్టుకోలేక, ఎవరికీ చెప్పుకోలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. పాఠశాల స్థాయిలో నైతిక అంశాలకు, విలువలకు, సూక్తులకు అవకాశం ఉన్న పాఠ్యాంశాలు ఎక్కువగా తెలుగు భాషలో మూడు నుంచి పదవ తరగతి వరకు ఉన్నాయి. వేమన శతకం, సుమతీ శతకం, మహాభారత నీతి కథలు, చిన్నయ్య సూరి రాసిన స్నేహబంధం, శతక కవులు రాసిన శతక సుధ, శతక మధురిమ మొదలగునవి విద్యార్థులలో నైతిక విలువలను పెంపొందించడానికి ప్రభుత్వం పాఠ్యాంశాలుగా పెట్టింది.

అదేవిధంగా సాంఘిక శాస్త్రంలో కుటుంబాలు, కుటుంబ రకాలు సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సమాజం, సమాజంలో పౌరుల పాత్ర, హక్కులు, విధులు లాంటి అంశాలు విద్యార్థులలో సహకార భావనలు, విలువలను పాదు కోల్పడానికి చేర్చడం జరిగింది. నేడు అనేక ప్రైవేటు యాజమాన్యాలలో ఉన్న పాఠశాలల్లో తెలుగు, సాంఘిక శాస్త్ర బోధనను చిన్నచూపు చూస్తున్నాయి. రోజువారి కాల పట్టికలో వాటికి పిరియడ్ లు కేటాయించని పరిస్థితి నెలకొని ఉంది. వారంలో సగం రోజుల్లోనే వీటి బోధనను ముగించేస్తున్నారు. ఇంటర్మీడియట్ స్థాయిలో కూడా అనేక కార్పోరేట్ కళాశాలలో తెలుగు, ఆంగ్ల పాఠ్యపుస్తకాలను వార్షిక పరీక్షల ముందు రెండు మాసాలలో ప్రారంభించి ముగిస్తున్నారు.

రెండు మాసాల సమయంలో మార్కుల ప్రాతిపదికనే



- బిల్లి పెల్లి లక్ష్మారెడ్డి,
సామాజిక విశ్లేషకుడు, 9440966416

విద్యా బోధన ఉంటున్నది. ఇటువంటి పరిస్థితులలో పాఠశాల స్థాయి నుంచి ఇంటర్మీడియట్ వరకు నైతిక అంశాలను, విలువలను విద్యార్థుల్లో పెంపొందించే పాఠ్యాంశాల బోధనకు ఆటంకం ఏర్పడి వాటికి విలువే లేకుండా పోతోంది. ఫలితంగా బాల్యంలో నేర్చుకోవాల్సిన నీతి నియమాలు, సత్ప్రవర్తన, విలువలు నిర్లక్ష్యం కావడంతో ఉన్నత విద్యావంతుల్లో విలువల పతనం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. ఉన్నత చదువులు చదివిన వైద్యుల్లో కొంత మంది డబ్బులకు కక్కుర్తి పడి గర్భస్థ స్త్రీ శిశు హత్యలకు పాల్పడుతున్నారు. నిర్మాణరంగంలో అనేక సంవత్సరాలు మన్నికగా ఉండాల్సిన కట్టడాలు ఇంజనీరింగ్ అధికారుల అవినీతి వలన కుప్పకూలిపోతున్నాయి. నేరాలు అరి కట్టాల్సిన కొంతమంది పోలీసులు వాటికి కొమ్ముకొస్తున్నారు. అన్యాయాలకు అక్కడక్కడ అండగా న్యాయవాదులు, ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేస్తున్న కల్తీ వ్యాపారులు, వేలకోట్ల రూపాయల దేశ సంపాదన కొల్లగొట్టి విదేశాలకు పారిపోతున్న బడాపార శ్రామికవేత్తలు మొదలగు వారంతా పెద్ద చదువులు చదివిన వారే కావడం గమనార్హం. విద్యార్థులకు మిగతా సబ్జెక్టుల మాదిరిగా నైతిక విలువలను ఒక పాఠ్యపుస్తకంగా పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ వరకు పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విలువల విద్యను నూతన విషయం చేసి బోధించినట్లయితే విద్యార్థుల్లో ఆశించిన ప్రయోజనాలు నెరవేరుతాయి. ఎస్ఎస్ సి, ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిలో అన్ని సబ్జెక్టుల లాగా నైతిక విద్యను ప్రత్యేక విషయంగా రూపుదిద్ది తప్పనిసరి ఉత్తీర్ణత మార్కులు కేటాయించి అర్హత సాధిస్తేనే పై తరగతికి అర్హులను చేయాలి. దీని బోధనకు గాను అత్యున్నతమైన అర్హతలు కల ఉపాధ్యాయులను, అధ్యాపకులను ప్రభుత్వం నియామకం చేయాలి. నీతి, నిజాయితీ, సత్ప్రవర్తన, విధినిర్వహణ, దయ, ధైర్యం, త్యాగం, సహకారం, ఆత్మగౌరవం, ధర్మం, సత్యం, శ్రద్ధ, గౌరవం లాంటి వాటికి నైతిక విలువల పాఠ్యపుస్తక రూపకల్పనలో ప్రాధాన్యత కల్పించాలి. తెలంగాణ ప్రభుత్వం ఈ నూతన ప్రక్రియకు తొందరలో శ్రీకారం చుట్టినట్లయితే బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసినట్లు అవుతుంది. సమాజంలో శాంతి నెలకొంటుంది.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999




కంది మౌనా శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో

# జైబాపు, జైభీం ,జై సంవిధాన్ పాదయాత్ర




- పిప్పర్ వాడ లో కార్యక్రమం.. పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులు

**ఆదిలాబాద్, మహా:** సీయం రేవంత్ రెడ్డి , టీపీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షిన టరాజన్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి ఆదేశాలతో ఆదిలాబాద్ నియోజకవర్గవ్యాప్తంగా జైబాపు, జైభీం ,జై సంవిధాన్ నినాదాలతో పల్లెలు మార్మోగుతున్నాయి. బుధవారం కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో భోరజ్ మండలం పిప్పర్ వాడ లో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోందని దీన్ని అందరూ అడ్డుకోవాలని కంది మౌనా శ్రీనివాస రెడ్డి అన్నారు. రాజ్యంగా పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ జైబాపు, జైభీం ,జై సంవిధాన్ అభియాన్ తో కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆమె వివరించారు. పేదల బడుగు బలహీన వర్గాల కోసం ఎంతో కష్టపడి తయారు చేసిన రాజ్యాంగాన్ని మారుస్తామంటే ఎవరూ అంగీకరించరన్నారు. దేశ సమగ్రత కోసం పాటు పడే కాంగ్రెస్ పార్టీ కకి ప్రజలంతా తమ మద్దతు తెలపాలని కోరారు. గ్రామంలోని ఇంటింటికి జైబాపు, జైభీం ,జై సంవిధాన్ నినాదాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.ఈ కార్యక్రమం లో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,తాజా మాజీ ఎంపీటీసీ ముడుపు ప్రశాంత్ రెడ్డి,మాజీ సర్పంచ్ సర్సన్ వెంకట్ రెడ్డి, గ్రామ నాయకులు గడ్డం కిష్టా రెడ్డి,కుంట ఉష రెడ్డి,నాయకులు బూర్ల శంకరయ్య,దాసరి ఆశన్న,ముక్కెర సంతోష్, ఎల్మ రామ్ రెడ్డి, మహిళా నాయకురాలు దేశెట్టి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



నూతన విద్యుత్ ఉపకేంద్రాలకు

# శంకుస్థాపన

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**నర్సంపేట, మహా:** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని గురిజాల, కొండాపూర్, నర్సంపేట పట్టణం ద్వరకపేటలలో మూడు నూతన 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రలకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శంకుస్థాపన చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని మూడు గ్రామాలలో 7.5 కోట్లతో నూతన విద్యుత్ ఉపకేంద్రలకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి వాడలో ప్రతి ఒక్కరూ కూడా మీటర్ లు తీసుకొని విద్యుత్ అధికారులకు సహకరించాలని అన్నారు గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ముఖ్య ప్రాధాన్యత కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుంది అని అన్నారు. అదే విధంగా గ్రామంలోకి అంతర్గత రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్,విద్యుత్ శాఖ అధికారులు, ఎమ్మార్వో ,ఎంపిడిఓ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలపై కవిత మొసలి కన్నీరు


- బీసీల పోరాటానికి మద్దతు అవసరం లేదు
- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వేముల మహేందర్ గౌడ్



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా,మహా:** బిసి ల పోరాటానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మద్దతు అవసరం లేదని.. బీసీలపై కవిత మొసలి కన్నీరును బీసీలు ఎప్పటికీ నమ్మరని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీల పోరాటానికి కవిత మద్దతు అవసరం లేదన్నారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వంలో పూలే దంపతుల విగ్రహాలు ఎందుకు ఏర్పాటు చేయలేదో ముందు కవిత బీసీలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో కాదు..హైదరాబాద్ నడి బొడ్డున పూలే స్మృతి వనాన్ని ఏర్పాటు చేసి అందులో పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు మహేందర్ గౌడ్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా బీసీని నియమించాలన్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తానని కేసీఆర్ చేత కవిత ప్రకటింపజేయాలన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో బీసీలకు సమయం ఇవ్వని ఏకైక ముఖ్యమంత్రి కేసీఆరేనన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న బీసీలను అణిచివేయడానికి..వారి నోరు మూయించడానికే కవిత బీసీ రాగం ఎత్తుకుందన్నారు. అందుకే ఆమె చేసిన ధర్నాలలో బీఆర్ఎస్ పార్టీలో ఉన్న బీసీ నేతలు ఎవరు పాల్గొనడం లేదన్నారు. బీసీ సమస్యలపై బీఆర్ఎస్ పార్టీలో ఉన్న బీసీ నేతలు పోరాటం చేస్తే వారికి మద్దతుగా నిలబడతామన్నారు. ఢిల్లీలో జరిగిన బీసీల పోరుగర్జనపై కవిత కించపరుస్తూ మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. బీసీల గురించి కవిత మొదటగా మాట్లాడాలంటే కుల గణనలో పాల్గొనని బీసీ బిల్లుకు మద్దతు తెలుపని తన తండ్రి కేసిఆర్ ను మొదటగా కవిత నిలదీయాలన్నారు. హైదరాబాదులోని సచివాలయం దగ్గరలో రెండు ఎకరాలలో జ్యోతిబాపూలే స్మృతి వనం ఏర్పాటు చేసి పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా పార్లమెంట్ ఆవరణలో కేంద్ర ప్రభుత్వం పూలే దంపతుల విగ్రహాలను ప్రతిష్టింపజేయాలన్నారు. జాతీయ మరియు రాష్ట్ర ప్రాజెక్టులకు, ఎయిర్ పోర్టులు, నేషనల్ పార్కులకు మహాత్మా జ్యోతిబాపూలే పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.

# కళ్యాణ వేడుకల్లో కంది మౌనా శ్రీనివాస రెడ్డి

నూతన వధూవరులను దీవించి కానుకల బహుకరణ





**ఆదిలాబాద్, మహా :** పెళ్లిళ్ల సీజన్ కావడంతో కళ్యాణ వేదికలన్నీ కళకళలాడుతున్నాయి. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి ఆహ్వానించిన వారి వివాహాది శుభకార్యాలకు హాజరయ్యారు. కళ్యాణ మండపాలలో మిత్రులు , శ్రేయోభిలాషులు అభిమానులను ఆప్యాయంగా పలకరించారు. పట్టణంలోని పలు పంక్షన్ హాళ్ల లో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన దంపతులు ఏనుగు సృచేతన్ రెడ్డి సృజన,సోమ అభిజిత్ రెడ్డి శ్రీనిక, అందె వార్ గణేష్ మానస లను నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆశీర్వదించి కంది శ్రీనన్నపెళ్లి కానుకలను బహుకరించారు. ఆమె వెంట జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,మహిళా నాయకురాలు దేశెట్టి ప్రభావతి,నాయకులు బూర్ల శంకరయ్య,అడ్డి రూకేష్ రెడ్డి, గడ్డం జగదీష్ రెడ్డి,దాసరి ఆశన్న,ఎల్మ రామ్ రెడ్డి కుంట ఉష రెడ్డి,దీపక్ రావు తదితరులు హాజరయ్యారు.



# ఏకాత్మత మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తితో

బిజెపి కొనసాగుతుంది

**కరీంనగర్, మహా:** ఏకాత్మత మానవత వాదం, అంత్యోదయ స్ఫూర్తితో బిజెపి కొనసాగుతుందని, దేశంలో ఏ పార్టీకి లేని విధానం, సిద్ధాంతం బిజెపికే ఉన్నాయని, ఆ పార్టీ అనుసరించిన విధానాలు మార్గాలతోనే ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలు కలిగిన నెంబర్ వన్ పార్టీగా భారతీయ జనతా పార్టీ అవతరించిందని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బిజెపి ఆవిర్భావ దినోత్సవ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం రోజున గంగాధర బిజెపి క్రియాశీలక సభ్యుల సమావేశం మండల అధ్యక్షులు పంజాల ప్రశాంత్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశ హితం కోసం పనిచేసే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమేనన్నారు. ఏకాత్మత మానవతావాదం , అంత్యోదయ భావనతో ప్రేరణ పొందిన బిజెపి, ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో వివిధ రాష్ట్రాల్లోని సంకీర్ణ ప్రభుత్వాలతో కలిసి అంత్యోదయ మార్గంలో నిరంతరం ముందు కొనసాగుతుందన్నారు. చిట్ట చివరి పేదల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా అంత్యోదయ విధానం తో ఏకత్మత మానవతావాదం ఆచరణగా , జాతీయ వాదమే సిద్ధాంతంగా కొనసాగుతున్న ఏకైక పార్టీ బిజెపి యే అన్నారు. 44 ఏళ్ల కఠోర సినిమా పోరాటం త్యాగాలతో పార్టీ స్థాయికి ఎదిగిందని, ఈ స్థాయికి పార్టీని తీసుకురావడానికి ఎంతోమంది మహానుభావులు విశేష కృషి చేశారని, వారు పార్టీకి చేసిన సేవలు మరువలేనివన్నారు. సబ్ కా సాత్ , సబ్ కా వికాస్ ధ్యేయంగా పని చేస్తున్న మోడీ ప్రభుత్వ పాలనపై దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ ఎంతో విశ్వాసం ఉందని, అందుకే వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వాలు , ఆరు రాష్ట్రాల్లో భాగస్వామ్య పక్షాలతో కలిపి (ఎన్ డి ఏ) ప్రభుత్వాలు కొనసాగుతున్నాయని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

అత్యంత కీలకమైంది

# దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు

- చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందాలి
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**జనగామ, మహా:** దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలోని చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఘనపూర్ (స్టేషన్) శాసన సభ్యులు కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. బుధవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్, ఘనపూర్ (స్టేషన్) మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ మారుజోడు రాంబాబు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ లతో కలిసి ఘనపూర్ (స్టేషన్) ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవాదుల ఎత్తిపోతల పథకం కింద భూసేకరణ ప్రక్రియ, పెండింగ్ పనుల పురోగతి, సాగు నీటి సరఫరాపై నీటి పారుదల శాఖ అధికారులతో క్షుణ్ణంగా చర్చించి, సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినదని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారానే ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలోని ఏడు మండలాలకు సాగుకు నీరు అందుతోందని, యుద్ధప్రాతిపదికన దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు. ప్రతి నెల సమీక్షిస్తూ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. మల్లన్నగండి లిఫ్ట్ 1, లిఫ్ట్ 2 పనులను జులైలోగా పూర్తిచేసి, సాగు నీరు అందించాలన్నారు. డిసెంబర్ లోపు అశ్వరావుపల్లి ప్రధాన కుడి కాలువ పనులు పూర్తి కావాలన్నారు. ఆర్ఎస్ ఘనపూర్ నుంచి నవాబ్ పేట ప్రధాన కాలువ సీసీ లైనింగ్ పనులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులందరూ సమన్వయంతో పెండింగ్ పనులన్నీ త్వరగా పూర్తిచేయాలని అలాగే నీటి నిర్వహణకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్డీసీలు సుహాసిని, హనుమాన్ నాయక్, ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, నీటి పారుదల శాఖ ఎస్ఈలు, ఈఈలు, డీఈలు, ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గ ఏజెన్సీ సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన గ్యాస్ ధరలకు నిరసనగా మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

- సన్నబియ్యం ఇస్తూనే గ్యాస్ ధరలు పెంచిన కేంద్రం
- పేద ప్రజలపై బారం మోపి మోసం చేస్తున్న మోడీ



**రంగారెడ్డి జిల్లా, మహా:** పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామెల్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని దేశవ్యాప్త పిలుపులో భాగంగా, సిపిఎం మండల కార్యదర్శి బుగ్గరాములు ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేసి మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామేలు మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు తగ్గుతుంటే భారతదేశంలో బిజెపి మోడీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపే విధంగా గ్యాస్ ధరలు పెంచడం సరైనది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ పై 50 రూపాయలు ధరలు పెంచడం వల్ల ఇతర నిత్యవసర సరుకుల ధరలు పెరుగుతాయన్నారు. ఇప్పటికే పెరిగిన ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉచిత సన్న బియ్యం అంటూనే, మరోపక్క గ్యాస్ ధరలు పెంచడం ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తు ప్రజలపై బారాలు మోపడం ద్వారా మోడీకి ఎవరి మీద ప్రేమ ఉందో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. లేని పక్షంలో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని ఆయన కేంద్ర ప్రభుత్వాని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జంగయ్య, జగన్, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేశ, మండల నాయకులు వెంకటేష్, ముసలయ్య, ఆనంద్, లింగస్వామి, నరసింహ, జంగయ్య, ప్రభుదాస్, శంకర్, వీరేష్, స్వామి, దాసు, యాదగిరి, బిక్షపతి, బాలరాజ్, మహేష్, తరంగ్ తదితరులు పాల్గొన్నారు.

# బోథ్ కు చెందిన డాక్టర్ రుక్మారెడ్డికి టీజీఎమ్ఎస్ఐడీసీ లో కీలక పదవి



**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన డా. రుక్మారెడ్డి తెలంగాణ ప్రభుత్వ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టీజీఎమ్ఎస్ఐడీసీ లో ఔషధాలు , శస్త్రచికిత్సోపకరణాల విభాగానికి జనరల్ మేనేజర్‌గా నియమితులయ్యారు.ఈ బాధ్యతలో డా. రుక్మారెడ్డి, రాష్ట్రంలోని సబ్‌సెంటర్ల నుండి మెడికల్ కాలేజీ దవాఖానల వరకు అన్ని స్థాయిల్లో ప్రభుత్వ దవాఖానల ఔషధ అవసరాలు, కొనుగోళ్లు, నిల్వలు , పంపిణీ వ్యవస్థను పర్యవేక్షిస్తారు. ప్రభుత్వ వైద్య సేవలను సమర్థవంతంగా చేయడంలో కీలకంగా వ్యవహరించనున్నారు.ఈ సందర్భంగా డా. రుక్మారెడ్డి మాట్లాడుతూ: ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలంటే ప్రభుత్వ దవాఖానల్లో అవసరమైన ఔషధాలు, శస్త్రచికిత్సోపకరణాలు సమయానికి అందుబాటులో ఉండాలన్నారు.. టీజీఎమ్ఎస్ఐడీసీ ద్వారా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడంలో కృషి చేస్తానన్నారు.. తన స్వగ్రామమైన బోథ్‌కు గౌరవం తెచ్చే విధంగా పనిచేయడం తనకెంతో గర్వంగా ఉందని పేర్కొన్నారు. ఈ నియామకంతో రాష్ట్ర ఆరోగ్య రంగంలో మరింత గుణాత్మక మార్పులు సాధ్యం అవుతాయని టీజీఎమ్ఎస్ఐడీసీ అధికారులు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా వాసి బోథ్‌కు చెందిన డా. రుక్మారెడ్డికి ఇలాంటి ప్రాధాన్యత గల పదవి దక్కడంతో జిల్లా ప్రజలతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోలీస్ కుటుంబానికి

# భద్రత చెక్ ను అందజేసిన సిపి



హన్మకొండ, మహా: వరంగల్ పోలీస్ కమిషనరేట్లో ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో హాస్పటల్ లో చికిత్స పొందిన గత సంవత్సరం సెప్టెంబర్ 13వ తేదీన మరణించిన హెడ్ కాని స్టేబుల్ సదానందం కుటుంబానికి పోలీస్ భద్రత మంజూరు 7లక్షల 89వేల 920 రూపాయల చెక్కును వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఝా చేతుల మీదుగా చెక్కును మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుమారుడికి అందజేశారు. ప్రస్తుతం మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబ స్థితిగతు లపై పోలీస్ కమిషనర్ ఆరా తీశారు. ఈ కార్యక్రమం ఎ. ఓ రామకృష్ణ, సూపరింటెండెంట్ రామాదేవి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరను

# వెంటనే ఉపసంహరించుకోవాలి

- మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి



**కరీంనగర్, మహా:** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ బండపై రూ. 50ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రోజున జిల్లా కేంద్రంలోని గీతా భవన్ చౌరస్తాలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్ నెత్తిన పెట్టుకొని ప్లే కార్డులతో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధర రూ 50కి పెంచడం మూలంగా పేద, మధ్యతరగతి ప్రజలపై తీరని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాల కాలం నుండి పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు గ్యాస్ ధరను ఇష్టానుసారం పెంచడం వల్ల ప్రజలపై మోయలేని భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగాయని, పెరిగిన ధరలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ములిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా ధరల మీద ధరలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై గ్యాస్ బండ భారం మోపటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ దానికి అనుగుణంగా పెట్రోల్,డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాల్సిన మోడీ ప్రభుత్వం ఆయిల్ కంపెనీల లాభాల కోసం ప్రజలపై భారాలు మోపుతుందని ఆరోపించారు. కార్పొరేట్లకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ రాష్ట్ర ప్రజలపై 400 కోట్ల భారం మోపడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ధరలు తగ్గే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం వచ్చాక 130.57% గ్యాస్ ధరలు పెరిగాయని, సబ్సిడీ తగ్గించుకుంటూ పెట్రోల్,డీజిల్ పై లీటరుకు రెండు రూపాయలు చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని వడ్డించిందని, దేశంలో రోజుకు 9 కోట్ల లీటర్ల పెట్రోల్ 30 కోట్ల లీటర్ల డీజిల్ వినియోగిస్తున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఇది పెను భారం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం,జి.బీమా సాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు యు శ్రీనివాస్, సుంకరీ సంపత్,ఎడ్ల రమేష్,డి.నరేష్ పటేల్, నాయకులు గజ్జల శ్రీకాంత్, జి.తిరుపతినాయక్, తిప్పారపు సురేష్, రాయి కంటి శ్రీనివాస్, పుల్లెల మల్లయ్య, కె నరేష్, కొంపెల్లి అరవింద్, కనకరాజు, సందేశ్, రాజు, విజయ్, అరవింద్, రాకేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ములుగు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా వేణుగోపాలాచారి

**ములుగు, మహా :** ములుగు జిల్లా బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా చక్రవర్తుల వేణుగోపాలాచారి ఎన్నిక య్యారు. బుధవారం ఎన్నికల అధికారులు దామల్ల సుధాకర్, మంద విజయ్ కుమార్ సమక్షంలో జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీని ప్రకటించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా రంగోజు భిక్షపతి, ఉపాధ్యక్షునిగా మేకల మహేందర్, కోశాధి కారిగా బానోతు స్వామిదాస్, సంయుక్త కార్యదర్శిగా ఓరుగంటి రాజేందర్, క్రీడా సాంస్కృతిక కార్యదర్శిగా రాచర్ల రాజ్ కుమార్, ఈసీ సభ్యులుగా మేకల అశోక్, రంగోజు సూర్యం ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మెంబర్లు, న్యాయ వాదులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పంపిణీ పథకం విప్లవాత్మకం


- సన్న బియ్యం పథకాన్ని పేదలంతా వినియోగించుకోవాలి
- లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేసిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్



**జనగామ, మహా:** దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్న బియ్యం పంపిణీ పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయడం విప్లవాత్మకమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ కేంద్రం ఎస్సీ కాలనీ లోని సన్న బియ్యం లబ్దిదారు తాటికొండ యాదమ్మ ఇంట్లో సన్న బియ్యంతో వండిన అన్నంతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ లబ్ధిదారుని కుటుంబ సభ్యులతో కలిసి సహ పంక్తి భోజనం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్న బియ్యం పంపిణీ చేయడం వల్లనే ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా తమ ఇంట్లో భోజనం చేసే అవకాశం లభించిందని సన్న బియ్యం లబ్ధిదారు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఇదంతా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పేద ప్రజల పట్ల ఉన్న ప్రేమ వల్లనే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళా కు పటిష్ట ఏర్పాట్లు చేయండి

బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే



**వరంగల్, మహా:** వరంగల్ నగరంలోని బస్టాండ్ వద్ద గల ఎం కె నాయుడు కన్వెన్షన్ హాల్ లో నిర్వహించే జాబ్ మేళా నిర్వహణకు పటిష్ట ఏ ర్పాట్లు చేయాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. ఈ నెల 11 న వరంగల్ ఎం కే నాయుడు కన్వెన్షన్ హాల్ యందు ఉదయం 9.30 గంటల నుండి నిర్వహించనున్న జాబ్ మేళాను విజయవంతం చేయడానికి బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయం లో అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశం లో కమిషనర్ సమర్ధవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ మంత్రి వర్యులు కొండా సురేఖ ప్రత్యేక చొరవతో ఈ జాబ్ మేళా ను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఇందులో సుమారు 60 కంపెనీలు పాల్గొనే అవకాశం ఉన్నందున జాబ్ మేళా లో పాల్గొనే నిరుద్యోగ యువత సంఖ్య కూడా భారీగానే ఉండే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మున్సిపల్ విభాగం నుండి సౌకర్యాలు కల్పించడానికి ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని పారిశుధ్య నిర్వహణ మంచి నీటి సరఫరా తదితర సౌకర్యాల కల్పనలో ఏలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి రాజేశ్వర్, ఏం హెచ్ ఓ డా.రాజేష్, టీఎంసీ రమేష్, తదితరులు, పాల్గొన్నారు.

# దశదిన కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు



**వరంగల్, మహా:** భారతీయ జనతా పార్టీ 27 వ డివిజన్ అధ్యక్షులు తమ్మిశెట్టి క్రాంతి తండ్రి తమ్మిశెట్టి రాజేశ్వరరావు దశదిన కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శ్రీ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్ ,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా కార్యదర్శి గోకే వెంకటేష్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు కందిమల్ల మహేష్, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, అపురూప రాజనీష్, బిజెపి డివిజన్ అధ్యక్షులు అంకాల జనార్ధన్, వైట్ల గణేష్, రామిని సుమన్, కోమకుల నాగరాజు, మామిడాల సతీష్, బిజెపి నాయకులు ఓడపెల్లి వీరన్న, కోట సతీష్, పేరాల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన వంట గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించు కోవాలి

- కట్టెల పొయ్యి తో వంట చేస్తూ నిరసన
- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరబోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్



**నర్సంపేట, మహా:** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ బండపై రూ. 50ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరబోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద కట్టెల పొయ్యి తో వంట చేస్తూ నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కోరబోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరరూ 50కి పెంచడం మూలంగా గ్యాస్ ధర876నుండి905 పెరగడం మూలంగా పేద, మధ్య తరగతి ప్రజలపై తీరని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన 11 సంవత్సరాల కాలం నుండి పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు గ్యాస్ ధరను ఇష్టానుసారం పెంచడం వల్ల ప్రజలపై మోయలేని భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక నిత్యవసర వస్తువులు ధరలు పెరిగి పెరిగిన ధరలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ములిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా ధరల మీద ధరల తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజల పై గ్యాస్ ధరలు మోపటం దారుణమని అని ప్రశ్నించారు. అంతర్జాతీయ వ్యాప్తంగా ఆయిల్ ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ దానికి అనుగుణంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాల్సిన మోడీ ప్రభుత్వం ఆయిల్ కంపెనీల లాభాల కోసం ప్రజలపై భారాలు మోపుతుందని ఆరోపించారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించేంతవరకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు కలకోట అనిల్ ఎండీ ఫరిదా, వజ్జంతి విజయ, బిట్ర స్వప్న, ఉదయగిరి నాగమణి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## గొత్తికోయ గ్రామాలను సందర్శించిన చీఫ్ ఇంజినీర్

**ములుగు, మహా :** ములుగు జిల్లాలోని గొత్తి కోయ గ్రామాలను పంచాయతీరాజ్ శాఖ చీఫ్ ఇంజినీర్ కె.సురష్ బుధవారం సందర్శించారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని పలు గొత్తి కోయ గ్రామాలను సందర్శించి పరిశీలించారు. మండలంలోని గంటలకుంట, గుండెంగవాయి గ్రామాల్లో తాగునీటి వనరులను పరిశీలించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో తాగునీరు అందించేందుకు గాను పర్యటించామన్నారు. సుక్షిత జలాలను అందించేందుకు జలవనరులపై పర్యవేక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ పర్యవేక్షక ఇంజనీర్ కె.మల్లేష్, ఏటూరునాగారం డీఈ ఎం.వెంకటసతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్

**వరంగల్, మహా:** వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని, కోలన్ పల్లి గ్రామం , రాయపర్తి మండల కేంద్రం లలో, పి ఏ సి ఎస్ వారి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలసి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ రైతులు ధాన్యంను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. సన్నరకం వడ్లకు క్వింటాకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నామని, రైతులకు ఏ ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతులు కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గంలో ప్రతి రైతుకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. చివరి గింజ వరకు కొంటామని అన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు



వచ్చే రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. చల్లని తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ ఉండేలా చూసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్ సంచులు, ప్యాడిక్లీనర్, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల లో త్రి ఫేస్ కరెంట్ తప్పని సరిగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఓ నీరజ, డి ఆర్ డి ఓ కౌసల్య దేవి,డిసిఎస్ఓ కిష్టయ్య, డి ఎం సివిల్ సప్లై సంధ్యారాణి, తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత ఎంపీడీవో సొసైటీ ఛైర్మెన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పాలనాధికారుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



కలెక్టర్ దివాకర

**ములుగు, మహా :** రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన గ్రామ పాలానాధికారుల పోస్టులకు విల్లింగ్ ఇచ్చేందుకు గాను మాజీ వీఆర్వోలు, వీఆర్ఏలు దరఖాస్తు చేసుకోవాలని, గురువారం ములుగులో మధ్యాహ్నం 3గంటలకు జరిగే అవగాహన సదస్సుకు హాజరు కావాలని కలెక్టర్ దివాకర టీఎస్ బుధవారం ప్రకటనలో సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఈనెల 16లోపు గూగుల్ ఫామ్ (https://forms.gle/AL3S8r9E2Dooz9Rc7) లో దరఖాస్తు చేసుకోవాలని, స్వయంగా సంతకం చేసిన కాపీని కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు సమర్పించాలని తెలిపారు. పని స్వభావం, నియమ నిబంధనలతో పాటు ఇతర వివరాల కోసం https://ccla.telangana.gov.in వెబ్సైట్ ను సందర్శించాలన్నారు. ఆసక్తి గల మాజీ వీఆర్ఓ, వీఆర్ఎలు నిర్ణీత గడువు లోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# నగర పరిధిలో టైలరింగ్ హబ్ ల ఏర్పాటుకు చర్యలు

- నగర్ మేయర్ గుండు సుధారాణి
- కమ్యూనిటీ ఆర్గనైజర్ లతో సమావేశం



**వరంగల్, మహా:** ఇందిర మహిళా శక్తి పథకం క్రింద గ్రేటర్ వరంగల్ నగర పరిధి లో టైలరింగ్ హబ్ ల ఏర్పాటు కు చర్యలు చేపట్టాలని నగర్ మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయం లో మెప్మా విభాగానికి చెందిన కమ్యూనిటీ ఆర్గనైజర్ లతో మేయర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ ఇందిర మహిళా శక్తి కార్యక్రమం లో భాగం గా దుస్తులు కుట్టడానికి వీలుగా కటింగ్ చేసి అందించడం పాటు కాజా బట్టన్స్ కుట్టి అందించే మిషన్ లను బల్దియా పరిధిలోని వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో ఒక్కొక్కటి చొప్పున టైలరింగ్ హబ్ లను(ఒక్కో యూనిట్ రూ.20 లక్షల వ్యయం తో) బల్దియా ఆధ్వర్యం లో ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ స్కీం లో భాగం గా ప్రభుత్వం వరంగల్ జిల్లాకు మిర్చి ప్రొడక్ట్ ఎంపిక చేసి కోటి రూపాయలు మంజూరు చేసినందున మిర్చి పౌడర్ యూనిట్ స్థాపించుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మేయర్ సూచించారు. అదేవిధంగా స్ట్రీట్ ఫుడ్ యూనిట్ ఏర్పాటు చేయుటకు గాను ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేసినందున ఎన్ ఐ టి వద్ద స్ట్రీట్ ఫుడ్ యూనిట్ ఏర్పాటుకు వేగవంతంగా చర్యలు చేపట్టాలని అన్నారు. జీ డబ్ల్యు ఎం సి పరిధిలోని స్వయం సహాయక మహిళా బృందాలకు (ఎస్ హెచ్ జీ) బల్దియా ఆధ్వర్యం లో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని వారికి సారీ రోలింగ్ టైలరింగ్ టై అండ్ డై మగ్గం వర్క్ లు హ్యాండ్ ఎంబ్రాయిడరీ లకు సంబంధించి బల్దియా పరిధి లోని కమ్యూనిటీ హాల్ ల యందు వరంగల్ (పశ్చిమ) నియోజకవర్గానికి 10 వరంగల్ (తూర్పు) నియోజకవర్గానికి 10 వర్ధన్న పేట నియోజకవర్గానికి 6 పరకాల నియోజకవర్గానికి 3 సెంటర్ల చొప్పున ఏర్పాటు చేయాలని, ఈ శిక్షణను ఎస్ హెచ్ జీ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రేటర్ నగర పరిధి లో ఖాళీ గా ఉన్న ప్రదేశాల్లో పండ్లను ఇచ్చే మొక్కలను నాటి వాటి నిర్వహణను ఎస్ హెచ్ జీ లు చూసేలా ప్రణాళిక లు సిద్ధం చేయాలని హార్టికల్చర్ అధికారులను మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అలివేలు హార్టికల్చర్ అధికారులు రమేష్, లక్ష్మారెడ్డి టీఎంసీ రమేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు శ్రీలత, సఫియా, రమ, సకినాల రమేష్, నాగరాజు రాజ్, కుమార్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్లీ బర్డ్ స్కీమ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి

- సి డి ఎం ఎ డా.టి కే శ్రీదేవి
- రాష్ట్ర వ్యాప్త మున్సిపల్ కమిషనర్ లతో టెలి కాన్ఫరెన్స్



**వరంగల్, మహా:** ఎర్లీ బర్డ్ స్కీమ్ ను సద్వినియోగం చేసుకునేలా చూడాలని సి డి ఎం ఎ డా.టి కే శ్రీదేవి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యాప్త మున్సిపల్ కమిషనర్ లు అధికారులతో ఎర్లీ బర్డ్ స్కీమ్ అమలు పై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. బల్దియా ప్రధాన కార్యాలయం నుండి కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి డి ఎం ఏ మాట్లాడుతూ ఎర్లీ బర్డ్ స్కీమ్ లో భాగం గా ముందస్తు గా ఆస్తి పన్ను చెల్లించడం ద్వారా 5% రిబెట్ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ముఖ్యంగా గత సం. ఈ స్కీమ్ ను వినియోగించుకున్న వారి పై ప్రత్యేక దృష్టి సారించి కొనసాగించేలా చూడాలని ఈ స్కీమ్ ద్వారా 30% లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళిక బద్ధం గా వ్యవహరించి వసూళ్లు జరిపేలా చూడాలని సి డి ఎం ఏ అన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, రవీందర్, తదితరులు, పాల్గొన్నారు.

# ఇంటర్, పదవ తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ రెవెన్యూ.. సి.హెచ్. మహేందర్ జి

**ములుగు, మహా :** ఈ నెల 20 నుండి నిర్వహించనున్న ఇంటర్, పదవ తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి. అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్లో ఇంటర్ పదవ తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణ పై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రశ్నపత్రాలను, కేంద్రాలకు తరలించే సమయంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇతరులు ఎవరూ కూడా పరీక్షా కేంద్రాల్లో ఉండరాదని, గుర్తింపు పొందిన వారిని తప్ప ఎవరినీ కేంద్రాలకు అనుమతించ రాదని ఆదేశించారు. ఇంటర్ పరీక్షల కోసం జిల్లాలో 3 సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, 712 మంది పరీక్ష రాస్తున్నారని తెలిపారు. 10వ తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షల కోసం 3 సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, 521 మంది పరీక్షలు రాస్తున్నారని అన్నారు. వేసవి దృష్ట్యా వైద్య శాఖ అధికారులు పరీక్షా కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందుబాటులో



ఉంచాలన్నారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ లను నియమించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట మహిళా పోలీస్ సిబ్బందికి డ్యూటీ కేటాయించాలని సూచించారు. కేంద్రాల్లో పరీక్ష రాసేవారికి అన్ని వసతులు కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి జి.పాణిని, డిఎం అండ్ హెచ్ ఓ గోపాలరావు, జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ నియంత్రణ అధికారి అప్పని జయదేవ్, పంచాయతీరాజ్, ఎలక్ట్రిసిటీ, రెవెన్యూ, పోస్టల్, ఇంటర్మీడియట్ విద్య, ఆర్టీసీ సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిఎంహెచ్వో



**వరంగల్, మహా:** వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు ఆ యుష్మాన్ ఆరోగ్యం మందిరం తీగలవేణి సంగెం మండలంలో ఆకస్మికంగా పర్యటించి వైద్యాధికారులను , వైద్య సిబ్బంది ప్రజలకు అందిం చవలసిన సేవల గురించి, సమయపాలన గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్ లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు, అందించాలని కోరినారు. అనవసరమైన శస్త్రచికిత్సలు చేయకుండా సాధారణ ప్రసావాలు ప్రోత్సహించాలి అని సూచించారు. సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు నిర్ధారణ పరీక్షలుచేయించితగుచికిత్సలుఅందించాలనికోరారు. ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగాఉండడానికిప్రయత్నంచేయాలనితెలిపారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు వచ్చినట్లయితే వెంటనే వైద్య సిబ్బందిద్వారాతగుచికిత్సలుపొందాలనిసూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పల్లె దవాఖానా లు ప్రజల ఆరోగ్య అవసరాలకు నిర్మించారని సిబ్బంది సమయ పాలన పాటించి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని కోరారు. వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అందించవలసిన సేవల గురించి సిబ్బందికి విధుల గురించి తగిన సూచనలు చేశారు. ఎండాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలు నీళ్ల విరోచనాలు, బంక విరోచనాలు, అంటువ్యాధులు, వడదెబ్బ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎలాంటి వ్యాధులకు గురి అయిన వెంటనే వారికి తగిన చికిత్సలు అందించాలని ముఖ్యంగా వేసవి కాలంలో ప్రతి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు , ఆరోగ్య కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పల్లె దవఖాన డాక్టర్లు , ఎల్డి కంప్యూటర్ నాగ రాజు,వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ర్యాంకులతో రామన్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్ధిని విద్యార్థినీలు

**శాయంపేట, మహా:** గత 18 సంవత్సరాల నుండి ఎంతో మంది విద్యార్థులకు నవోదయ, సైనిక్, టీజీ గురుకుల సెట్ లలో సీట్లు సాధించడంతోపాటు మండల, జిల్లా స్థాయిలో ఉన్నత స్థానాన్ని కైవసం చేసుకోవడం మండలం లోని కొప్పుల గ్రామ రామన్ కాన్సెప్ట్ స్కూల్ కే సాధ్యం.ఈ సంవత్సరం కూడా రాష్ట్రస్థాయి ర్యాంకులతో అత్యుత్తమ ఫలితాలు కనబరిచి ప్రభంజనం సృష్టించడం రామన్ కాన్సెప్ట్ స్కూల్ కే దక్కింది. నామని నిత్య శ్రీ, దిండిగాల జీవిక, బండారి వాసుదేవ్, బండారి సంజీయ్ కుమార్,ఆరె హర్షవర్ధన్, పొన్నం నిత్య శ్రీ, పల్నాటి కీర్తన, సామల జెయవర్మ, బండారి శాత్వికలు ఈ సంవత్సరం స్టేట్ ర్యాంకులు సాధించి నవోదయ, సైనిక్, టీ జీ గురుకులాలలో సీటు సంపాదించుకున్నారు. సీట్లు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు డైరెక్టర్ కల్లెపు సమ్మయ్య, ఉపాధ్యాయని ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేసి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ సమ్మయ్య మాట్లాడుతూ మా పాఠ



శాలలో చదివి స్టేట్ ర్యాంకులు కొట్టి గురుకులాలలో సీటు సంపాదించి మా పాఠశాలకు మంచిపేరు తెచ్చిన విద్యారిని, విద్యార్థులు భవిష్యత్తు లో ఉన్నత శిఖరాలు అధిరోహించి కన్న వారికి, గురువులకు, కన్న ఊరికి మంచిపేరు తీసుకొస్తారని ఆశిస్తున్నామని అన్నారు.మాకు సహకరించిన విద్యార్థిని,విద్యార్థుల తల్లిదండ్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.


## రొటీన్ ఇమినైజేషన్ సెషన్ పర్యవేక్షించిన



**వరంగల్, మహా:** వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు ఆదేశాల మేరకు డిప్యూటీ మాస్ మీడియా అధికారి అనిల్ కుమార్ బుధవారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం పైడిపల్లి లో పర్యటించి రొటీన్ ఇమినైజేషన్ సెషన్ పర్యవేక్షించారు. అనంతరం ఇమినైజేషన్ ప్రాముఖ్యత గురించి వివరించడంతో పాటు ఎండాకాలంలో వచ్చు సాధారణ ఆరోగ్య సమస్యలు హీట్ స్ట్రోక్, నీళ్ల విరేచనాలు, బంక విరోచనాలు, చర్మవ్యాధులు మొదలగు వాటిపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించడం జరిగినది .ప్రతి ఆరోగ్య మందిరంలో ఓ ఆర్ ఎస్ కార్నర్ నిర్మించాలని ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన తగిన చికిత్స లభించాలని, ఎండాకాలంలో వచ్చు సమస్యలపై అవగాహన కల్పించాలని తెలిపినారు. ప్రభుత్వము నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆశా కార్యకర్త నుండి అందరూ సమన్వయంతో పనిచేసి తగిన ఫలితాలు రాబట్టి జిల్లాను ఆరోగ్య జిల్లాగా మార్చడానికి ప్రయత్నం చేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఆరోగ్య కార్యకర్త యశోద ,ఆశా కార్యకర్తలు తిరుపతమ్మ ,యశోద, జ్యోతి ,అనిత ,ప్రభ, పద్మ, సుమలత, గాయత్రి, పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని మార్చే కుట్రను తిప్పికొట్టాలి

- ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్



**డోర్నకల్, మహా:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోందని దానిని మనమందరం కలిసి కట్టుగా తిప్పికొట్టాలని డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వీరారం, ఉల్లెపల్లి గ్రామంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మాగాంధీ. భారత రాజ్యాంగాన్ని అవహేళన చేస్తుందని విమర్శించారు. రాజ్యాంగంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకొని కేంద్రం చేస్తున్న కుట్రలను తిప్పకొట్టాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం రాజ్యాంగాన్ని ప్రతీ ఒక్కరు పరిరక్షించాలంటు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వంటికొమ్ము యువనాయకులు నూకల అభినర్రెడ్డి, మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్, మాజీ సర్పంచ్ రాంలాల్, మెంచ్ అశోక్. గుగులోతు రవినాయక్, బుర్ర యాదగిరి, బొల్లం కొమురయ్య, బుర్ర నవీన్, జెట్టి రాములు, బుర్ర వెంకన్న, జర్పుల విజయ్, సైదులు, రాంచంద్రు, కొప్పుల గోపి, సోమేశ్వర్రావు, గుండె పీరయ్య, సిరినాయక్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

**కాటారం, మహా :** నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా మెగా జాబ్ మేళా నిర్వహిస్థున్నట్లు భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, జాబ్ మేళా నిర్వహించే టాస్క్ కంపెనీ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి ఈ నెల 26 న నిర్వహించే మెగా జాబ్ మేళా కార్యక్రమ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రభుత్వ పరిధిలో టాస్క్ కంపెనీ నిర్వహిస్తున్న జాబ్ మేళా లో ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. 700 కంపెనీలు పాల్గొంటున్న ఈ జాబ్ మేళా లో 10 వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 26వ తేదీన నిర్వహించే జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు ఈ జాబ్ మేళా కార్యక్రమంపై గ్రామ గ్రామాన విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈనెల 26 వ తేదీన జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించే జాబ్ మేళా



కు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు హాజరవుతారని తెలిపారు. క్యూ ఆర్ కోడ్ లో దరఖాస్తు ఉంటుందని విద్యార్హతలు ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. క్యూ ఆర్ కోడ్ లో రిజిస్ట్రేషన్ చేయించుకొని వారు 26వ తేదీన నిర్వహించే జాబ్ మేళా స్టాళ్లులో నమోదు చేసుకోవాలని తెలిపారు. 10 వతరగతి నుండి డిగ్రీలు, పిజీలు ఇతర పై చదువులు చదువుకున్న నిరుద్యోగ యువత కు గొప్ప అవకాశమని అన్నారు. మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు, పోలీస్ శాఖ సమన్వయంతో అవగాహన కల్పించాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని అత్యవసర వైద్య కేంద్రం ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. మందులు, ఓ ఆర్ ఎస్ అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు.

## మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటల సాగుపై అవగాహన



**మహబూబాబాద్, మహా:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కేసముద్రం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగు అవగాహనలో భాగంగా బుధవారం కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు, తొర్రూరు, డోర్నకల్, తదితర మండలాల్లో మల్బరీ సాగు పై పట్టు పరిశ్రమ శాఖ ఉప సంచాలకులు ముత్యాల రావు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన వన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జీనుగు మరియన్న మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న వరి, పత్తి, మొక్కజొన్న, మిరప పంటల కు ప్రత్యామ్నాయంగా మార్కెట్ డిమాండ్ ఉన్న మల్బరీ సాగు చేయాలని రైతులందరితో అన్నారు. మల్బరీ సాగు చేస్తూ రైతులకు 2 ఎకరాలకు 3 లక్షలు రూపాయల నికర ఆదాయం పొందుతున్నారన్నారు. మల్బరీ సాగు కు మొక్కల పై, పట్టు పురుగుల పెంపకం షెడ్ నిర్మాణం కు, స్టాండులు, మెటీరియల్ మొదలైన వాటికి 4 లక్షల వరకు రాయితీ ప్రభుత్వం కల్పిస్తుంది అని తెలిపినారు. మొక్క నాటిన నుండి పట్టు గూళ్ళు మార్కెటింగ్ వరకు రైతు లు పాటించవలసిన పలు మేలైన యాజమాన్య పద్ధతులు ను రైతులకు తెలిపినారు.

# జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో జిల్లాను ముందంజలో ఉంచాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి




**మహబూబాబాద్, మహా:** మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రవి మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (MLHPs) తో సమీక్ష సమావేశం నిర్వహించారు సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్( AAM) సెంటర్లో జరుగుతున్న ఆరోగ్య సేవలు ముఖ్యంగా గర్భిణీ స్త్రీల నమోదు 12 వారంలో చేయాలని, గర్భిణీ స్త్రీలను మొదటి రెండు చెకప్ లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిచే, మూడు నాలుగు చెకప్ లు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ పంపించాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్స్ అన్ని కూడా సర్వీస్ చేసి ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని ఆయుష్మాన్ ఆరోగ్యం మంది సెంటర్ లో జరిగే సేవలు అన్ని ముందంజలో ఉంచాలని, పుట్టిన దగ్గరి నుంచి ఐదు సంవత్సరాలు పిల్లలందరికీ కూడా టీకాలు అందరికీ పడేలా చూడాలని, 30 సంవత్సరాల పైబడిన వారందరికీ బీపీ, షుగర్, క్యాన్సర్ సంబంధించిన పరీక్షలు చేయించుకోనేలాగా ప్రజలలో అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరికి ఆ బా కార్డ్ అకౌంట్ క్రియేట్ చేయాలని, జిల్లాను ముందంజలో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రమీల, డాక్టర్ సుధీర్ రెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ,డాక్టర్ సారంగం, డిపిఎం నీలోహన, హెల్త్ ఎడ్యుకేటర్స్ కె వి రాజు, గీత, డిడియం సౌమిత్,రాజ్ కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ పాల్గొన్నారు.

# చలో వరంగల్ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన నన్నపునేని

**వరంగల్ మహా:** బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, రాబోయే రజతోత్సవ మహాసభలను పురస్కరించుకొని వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని 26వ డివిజన్లో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశం 26వ డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజేంద్ర చారి ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపనేని నరేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ గత 25 ఏళ్లుగా తెలంగాణ ప్రజల ఆశయాలకు అంకితమై పనిచేస్తోం



దని, పార్టీ సాధించిన విజయాలు ప్రతి కార్యకర్త గర్వపడేలా ఉన్నాయని అన్నారు. రాబోయే రజతోత్సవ మహాసభలు ప్రతిఒక్క కార్యకర్తకు పండుగలా మారాలని, ఎల్కతుర్తిలో జరిగే ఈ సభను కానీ విని ఎరుగని రీతిలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ రూ.500 కోట్ల సమీకరణ




**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్, డిబెంచర్ల జారీ ద్వారా రూ. 500 కోట్ల వరకు సమీకరించనున్నట్లు వెల్లడించింది. వీటిపై కూపన్ రేటు వార్షికంగా 10.25 శాతం వరకు ఉంటుంది. ఈ నిధులను వ్యాపారరీత్యా క్లయింట్లకు రుణాలు ఇచ్చేందుకు, ఇతరత్రా కార్పొరేట్ అవసరాలకు వినియోగించుకోనుంది. ఈ ఇష్యూ ఏప్రిల్ 23న ముగుస్తుంది. 15 నెలల నుంచి 60 నెలల వరకు కాల వ్యవధులకు కంపెనీ ఈ డిబెంచర్లను జారీ చేయనుంది.

### శ్రీరామ్ ఏఎంసీలో వాటాకు ఓకే

శ్రీరామ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఎస్ఏఎంసీ)లో సంయుక్తంగా వాటా కొనుగోలు చేసేందుకు దక్షిణాఫ్రికా సంస్థ సన్లామ్‌తోపాటు శ్రీరామ్ క్రెడిట్ కంపెనీకి కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) అనుమతించింది. ఎస్ఏఎంసీ విస్తారిత వోటింగ్ వాటా మూలధనంలో 23 శాతానికి సమానమైన వాటాను ప్రిఫరెన్షియల్ కేటాయింపుల ద్వారా సన్లామ్ గ్రూప్‌నకు చెందిన సంస్థ సన్లామ్ ఎమర్జింగ్ మార్కెట్ (మారిషస్) సొంతం చేసుకోనుంది. ఎస్ఏఎంసీ ఈక్విటీ షేర్లలో సబ్‌స్క్రిప్షన్ ద్వారా వాటా పొందనుంది. ఇదేవిధంగా ఎస్ఏఎంసీ పబ్లిక్ వాటాదారుల నుంచి 26 శాతం వాటా కొనుగోలుకి సన్లామ్ ఎమర్జింగ్‌తోపాటు శ్రీరామ్ క్రెడిట్ కంపెనీకి సీసీఐ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.




# ఎయిర్‌బస్ హెలికాప్టర్‌లో మేకిన్ ఇండియా

మహీంద్రా గ్రూపులో భాగమైన మహీంద్రా ఏరోస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంఏఎస్‌పీఎల్) ఎయిర్‌బస్ నుంచి ప్రతిష్ఠాత్మక కాంట్రాక్టును పొందింది. ఎయిర్‌బస్‌కు చెందిన హెచ్ 130 లైట్ సింగిల్ఇంజిన్ హెలికాప్టర్ ప్రధాన ఫ్యూజ్‌లేజ్ తయారీ, అసెంబుల్ కాంట్రాక్టును దక్కించుకుంది. ఇది భారతదేశ 'మేక్ ఇన్ ఇండియా' విజన్‌కు ఒక ప్రధాన మైలురాయిని సూచిస్తుంది. ప్రపంచ ఏరోస్పేస్ సరఫరా గొలుసులో నమ్మకమైన భాగస్వామిగా మహీంద్రా స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఆ శాఖ కార్యదర్శి వుమ్‌లన్‌మాంగ్ వుల్నామ్, భారత్, దక్షిణాసియాలో ఎయిర్‌బస్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ రెమి మైలార్డ్, మహీంద్రా గ్రూప్ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనీష్ షా సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం, హెచ్ 130 హెలికాప్టర్ ప్రధాన ఫ్యూజ్‌లేజ్ అసెంబ్లీని మహీంద్రా ఉత్పత్తి చేస్తుంది. దీనిని ఐరోపాలోని ఎయిర్ బస్ హెలికాప్టర్ల కేంద్రానికి రవాణా చేస్తారు. ఉత్పత్తి వెంటనే ప్రారంభం కానుంది. మొదటి క్యాబిన్ అసెంబ్లీ 2027 మార్చి నాటికి డెలివరీ చేయనుంది. మహీంద్రా ఇప్పటికే ఎయిర్ బస్ వాణిజ్య విమాన కార్యక్రమాల కోసం వివిధ రకాల విడిభాగాలు, సబ్‌అసెంబ్లింగ్ లను సరఫరా చేస్తోంది. విడిభాగాలు, సబ్‌అసెంబ్లింగ్‌లే కాకుండా భారీ, మరింత సంక్లిష్టమైన ఏరో స్ట్రక్చర్ తయారీ, సరఫరాకు మహీంద్రా తన సామర్థ్యాల పోర్ట్ ఫోలియోను విస్తరిస్తున్న క్రమంలో తాజా ఒప్పందం ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది.

ఎయిర్ బస్ కు భారత్ ప్రధాన మార్కెట్, వ్యూహాత్మక వనరుల కేంద్రంగా ఉంది. ప్రతి ఎయిర్ బస్ వాణిజ్య విమానంలోనూ భారతదేశంలో తయారైన విడిభాగాలు, సాంకేతికతలు ఉన్నాయి. ప్రస్తుతం ఎయిర్ బస్ భారత్ నుంచి విడిభాగాలు, సేవల కొనుగోలు విలువ 1.4 బిలియన్ డాలర్లుగా ఉంది. హెచ్ 130 అనేది ప్రయాణికుల రవాణా, పర్యాటకం, ప్రైవేట్, వ్యాపార విమానయానం, అలాగే మెడికల్ ఎయిర్ లిఫ్ట్, నిఘా మిషన్ల కోసం రూపొందించిన ఇంటర్మీడియట్ సింగిల్ఇంజిన్ హెలికాప్టర్. ఇందులో విశాలమైన, అడ్డంకులు లేని క్యాబిన్ ఉంటుంది. పైలట్, మరో ఏడుగురు ఇందులో ప్రయాణించవచ్చు. చుట్టూ పెద్ద విండ్ స్క్రీన్, వెడల్పాటి కిటికీల ద్వారా అద్భుతమైన విజిబిలిటీ ఉంటుంది.

# ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌స్ట్రీమ్.. వారికి కొత్త రూల్స్




లండన్: సామాజిక మాధ్యమం ఇన్‌స్టాగ్రామ్‌లో 16 ఏళ్లలోపు టీనేజర్లు ప్రత్యక్షప్రసార సేవ అయిన లైవ్‌స్ట్రీమ్‌లో అనుచిత, అసభ్య, బ్లర్‌చేయని నగ్న వీడియోలు చూడకుండా కట్టడిచేసే లక్ష్యంతో కఠిన నిబంధనలను అమల్లోకి తెస్తున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటా ప్లాట్‌ఫామ్స్ మంగళవారం ప్రకటించింది. తల్లిదండ్రుల సమ్మతితోనే లైవ్‌స్ట్రీమ్ సదుపాయం కల్పిస్తామని సంస్థ స్పష్టంచేసింది. తమ అనుబంధ సామాజిక మాధ్యమ వేదికలైన ఫేస్‌బుక్, మెసెంజర్‌లలోనూ 18 ఏళ్లలోపు టీనేజర్లకు అదనపు 'కట్టడి' చర్యలను అమలుచేస్తామని మెటా పేర్కొంది. టీనేజీ వినియోగదారుల సమయాన్ని, ఆరోగ్యాన్ని సోషల్‌మీడియా తీవ్రంగా ప్రభావితంచేస్తున్న నేపథ్యంలో పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై తల్లిదండ్రులకు పూర్తి నిఘా అధికారాలను కట్టబెడుతూ మెటా గత సెప్టెంబర్‌లో 'టీన్ అకౌంట్ ప్రోగ్రామ్'ను అమల్లోకితేవడం తెల్సిందే. ఇన్‌స్టాగ్రామ్ నూతన కఠిన నిబంధనలను తొలుత అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియాలలో అమలుచేయనున్నారు. మరికొద్ది నెలల్లో ప్రపంచవ్యాప్తంగా ఈ నిబంధనలను అమలుచేస్తారు. నిబంధనలు అమల్లోకి వచ్చాక టీనేజర్ల ఖాతాల్లో ఇన్‌స్టాగ్రామ్ లైవ్ ఆప్షన్ కనపడదు. తల్లిదండ్రుల పర్మిషన్ వచ్చాకే కనిపిస్తుంది.

# క్రెడిట్ కార్డ్ బిల్లుల భారం.. ఉందిగా ఉపాయం!

ప్రస్తుతం క్రెడిట్ కార్డుల (credit card) వినియోగం బాగా పెరిగింది. దీంతో ఖర్చుల మీద నియంత్రణ లేక క్రెడిట్ కార్డుల బిల్లులు భారీగా పెరిగిపోతున్నాయి. ఇలా వచ్చిన భారీ మొత్తం బిల్లులను ఒకేసారి కట్టడానికి కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇందు కోసమే దేశంలో అతిపెద్ద ప్రభుత్వ బ్యాంక్ ఎస్‌బీఐ (SBI) క్రెడిట్ కార్డు వినియోగదారుల కోసం ప్రత్యేక ఫీచర్ అందుబాటులో ఉంది. క్రెడిట్ కార్డు పెద్ద మొత్తం బిల్లుల నిర్వహరణను 'ఎస్‌బీఐ కార్డ్ ఫ్లెక్సీపే' సదుపాయం సులభతరం చేస్తుంది. ఈ ఫీచర్ ద్వారా కార్డుదారులు పెద్ద కొనుగోళ్లను సులభమైన నెలవారీ వాయిదాలుగా (EMI) మార్చుకోవచ్చు. తద్వారా ఒకేసారి ఏకమొత్తం చెల్లించాల్సిన ఇబ్బందిని లేకుండా చేసుకోవచ్చు. అసలేంటీ ఎస్‌బీఐ ఫ్లెక్సీపే ఫీచర్.. అర్హత ప్రమాణాలు, ఇతర వివరాలను ఈ కథనంలో తెలుసుకుందాం. ఎస్‌బీఐ ఫ్లెక్సీపే ఫ్లెక్సీపే అనేది ఎస్‌బీఐ కార్డ్ అందించే ఫీచర్. ఇది మీ లావాదేవీలను సులభమైన వాయిదాలుగా మార్చుకోవడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. రూ.500 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలను ఈఎంఐలుగా మార్చుకోవచ్చు. ఇది మూడు, ఆరు, తొమ్మిది, 12, 18, 24 నెలలు వంటి రీపేమెంట్ కాలపరిమితి ఎంపికలను అందిస్తుంది. ఇక రూ.30,000 లేదా అంతకంటే ఎక్కువ కొనుగోళ్లకు 36 నెలల ఈఎంఐ ప్లాన్ ఎంచుకోవచ్చు. ఫ్లెక్సీపే కోసం కనీస బుకింగ్ మొత్తం రూ .2,500, అయితే ఇది ఆఫర్ల ఆధారంగా మారవచ్చు. అలాగే, గత 30 రోజుల్లో చేసిన లావాదేవీలను ఫ్లెక్సీగా మార్చుకోవచ్చు. క్రెడిట్ కార్డు బిల్లులను ఈఎంఐలను మార్చుకునే ముందు మీ క్రెడిట్ స్కోర్, క్రెడిట్ యుటిలైజేషన్ రేషియోను ఒకసారి చూసుకోవాల్సి ఉంటుంది.

**ఈఎంఐలుగా మార్చుకోండిలా..**

ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా వినియోగదారులు తమ ఎస్‌బీఐ కార్డ్ ఆన్‌లైన్ ఖాతాలోకి లాగిన్ అయి, 'ఈఎంఐ అండ్ మోర్' విభాగానికి వెళ్లి 'ఫ్లెక్సీపే' ఎంచుకోవచ్చు. మార్చాలనుకుంటున్న లావాదేవీని, తగిన కాలపరిమితిని ఎంచుకుని అభ్యర్థనను ధృవీకరించండి. అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొన్న ఎస్‌బీఐ కార్డ్ కస్టమర్ సర్వీస్ హెల్ప్ లైన్‌కు కూడా కస్టమర్లు కాల్ చేసి కస్టమర్ సపోర్ట్ టీమ్ సహాయంతో ఈఎంఐ మార్పిడిని అభ్యర్థించవచ్చు. వాళ్లు మీకు ప్రక్రియపై మార్గనిర్దేశం చేస్తారు. అలాగే వినియోగదారులు ఎస్‌బీఐ కార్డ్ మొబైల్ యాప్‌లోనూ ఫ్లెక్సీపే ఎంపికను యాక్సెస్ చేయవచ్చు. అవసరమైతే లావాదేవీ మొత్తాన్ని సవరించి, కాలపరిమితిని ఎంచుకుని అప్లయి చేయవచ్చు.


## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# అమెరికాకు షాకిచ్చిన చైనా



బీజింగ్: ప్రతీకార సుంకాల విధింపులో అమెరికా చైనాలు నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఖయ్యానికి కాలుదువ్వుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ) మొదలు పెట్టిన సుంకాల యుద్ధాన్ని చైనా కూడా అదే స్థాయిలో తిప్పికొడుతోంది. ఇందులో భాగంగా బుధవారం అమెరికా వస్తువులపై ప్రస్తుతం ఉన్న 34 శాతం టారిఫ్‌ను 84శాతానికి పెంచుతూ చైనా నిర్ణయం తీసుకుంది. అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై మరో 50 శాతం అదనపు సుంకాలు విధించారు. అమెరికాపై చైనా 34 శాతం ప్రతీకార సుంకాలపై సోమవారం ఆయన మండిపడటం, మంగళవారం మధ్యాహ్నం లోపు వాటిని వెనక్కు తీసుకోవాలని అల్టీమేటం జారీ చేయడం తెలిసిందే. ఆ హెచ్చరికలను డ్రాగన్ దేశం బేఖాతరు చేసింది. బెదిరింపులకు జడిసేది లేదని కుండబద్దలు కొట్టింది. ''మా విషయంలో అమెరికా తప్పులపై తప్పులు చేస్తోంది. ఈ బ్లాక్‌మెయిలింగ్‌కు లొంగే ప్రసక్తే లేదు. చివరిదాకా పోరాడి తీరతాం. మా ప్రయోజనాల పరిరక్షణకు ఎందాకైనా వెళ్తాం. 50 శాతం టారిఫ్‌లు విధిస్తే మావైపు నుంచీ అంతకంతా ప్రతీకార చర్యలుంటాయి'' అని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ మంగళవారం ప్రకటించారు. వాణిజ్య, టారిఫ్ యుద్ధాల్లో విజేతలంటూ ఎవరూ ఉండరని హితవు పలికారు. అయినా చైనా ఈ విషయమై తమతో చర్చలకు వస్తుందని ఎదురు చూస్తున్నట్లు ట్రంప్ చెప్పుకొచ్చారు. ''వాళ్లూ ఏదో ఒక ఒప్పందానికి రావాలనే ఆశ పడుతున్నారు. కానీ ఎక్కణ్నుంచి మొదలు పెట్టాలా అని సతమతమవుతున్నారు'' అన్నారు. కానీ మంగళవారం డెడ్‌లైన్ ముగిసినా చైనా నుంచి అలాంటి సూచనలేవీ రాకపోవడంతో వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లెవిట్ మీడియా ముందుకొచ్చారు. 'చైనాపై 50 శాతం అదనపు సుంకాలు విధిస్తున్నాం. ఈ నిర్ణయం బుధవారం నుంచే అమల్లోకి వస్తుంది' అని ప్రకటించారు! దాంతో అగ్ర రాజ్యాల టారిఫ్ పోరు ముదురు పాకాన పడింది. చైనాపై మార్చిలోనే అమెరికా 20 శాతం సుంకాలు విధించడం, గత వారమే ట్రంప్ మరో 34 శాతం బాదడం తెలిసిందే. తాజా 50 శాతంతో కలిపి చైనాపై అమెరికా మొత్తం సుంకాలు ఏకంగా 104 శాతానికి చేరాయి! టారిఫ్‌లపై చైనాతో చర్చలకు చాన్సే లేదని సోమవారమే ట్రంప్ బెదిరించిన నేపథ్యంలో రెండు దేశాల మధ్య పూర్తిస్థాయి వాణిజ్య యుద్ధం తప్పేలా లేదు.

# దేశ సమస్యలు తీర్చాలంటే దేశాన్ని ఎక్సరే తీయాలి.. ఏఐసీసీలో రాహుల్



**గాంధీ నగర్ :** దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. దేశ సమస్యలు తీర్చాలంటే దేశాన్ని ఎక్సరే తీయాలని వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో రెండో రోజు 'అఖిల భారత కాంగ్రెస్ కమిటీ' (ఏఐసీసీ) సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడారు. దళితులు, ఆదివాసీలు, పేదల కోసం కాంగ్రెస్ పనిచేస్తోంది. బడుగు బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ నిత్యం పోరాటం చేస్తుంది. కులగణనతో దేశంలో ఓబీసీల సంఖ్య తేలుతుంది. తెలంగాణలో కులగణన చేపట్టాం. జాతీయ స్థాయిలో జనగణన చేసే వరకు పోరాడుతాం. కుల గణనతో ఏ వర్గం జనాభా ఎంత ఉంటుందో తేలుతుందని వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మంగళవారం ప్రారంభమైన ఏఐసీసీ సమావేశాలు కొనసాగుతున్నాయి. 1,700 మంది ప్రతినిధులు దీనికి హాజరయ్యారు. తొలిరోజు ఏప్రిల్ 8న విస్తృత కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఏప్రిల్ 9న ఏఐసీసీ సభ్యులతో సమావేశం కొనసాగుతోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ రెండు సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల సీఎంలు దీనిలో పాల్గొన్నారు.

# ఇది తీవ్రమైన ఉల్లంఘనే.. కేంద్రానికి సుప్రీం చీవాట్లు


**న్యూఢిల్లీ:** రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స అందించే విషయంలో కేంద్ర ప్రభుత్వ అలసత్వాన్ని సుప్రీం కోర్టు మందలించింది. ఈ విషయాన్ని తీవ్ర ఉల్లంఘనగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరిస్తూ బుధవారం సంబంధిత అధికారులకు సమన్లు జారీ చేసింది. ప్రమాదం జరిగిన వెంటనే సమీప ఆసుపత్రిలో ఉచిత వైద్య సాయం కల్పించడమే క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ స్కీమ్ ఉద్దేశం. ప్రత్యేకించి గోల్డెన్ అవర్ (ప్రమాదం జరిగిన గంటలోపే)తో సహా రోడ్డు ప్రమాద బాధితులందరికీ దీన్ని వర్తింపజేయాల్సి ఉంటుంది. దీని అమలుకుగానూ కేంద్రానికి సుప్రీం కోర్టు మార్చి 14వ తేదీని గడువుగా ప్రకటించింది. అయితే గడువు దాటినా కేంద్రం ఇంతదాకా దీనిని అమలు చేయలేదు. ''ప్రభుత్వానికి ఇచ్చిన గడువు ముగిసిపోయింది. దీనిని తీవ్రమైన కోర్టు ఆదేశాల ఉల్లంఘనగా పరిగణిస్తున్నాం'' అని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం బుధవారం వ్యాఖ్యానించింది. ఈ అలసత్వానికి సంబంధించి రోడ్డు రవాణా & జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి, సీనియర్ అధికారులకు కోర్టు సమన్లు జారీ చేసింది. ''అధికారులు కోర్టులకు హాజరైతేనే మా ఆదేశాలను తీవ్రంగా పరిగణిస్తారు. ఈ విషయాన్ని మా సుదీర్ఘ అనుభవం ద్వారా మేం తెలుసుకున్నాం. ఏప్రిల్ 28వ తేదీన సమన్లు అందుకున్నవాళ్లు కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలి. సకాలంలో చికిత్స అందకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో దేశవ్యాప్తంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇక్కడ.. ఒక్క విషయాన్ని మేం స్పష్టంగా చెప్పదల్చుకున్నాం. ఎటువంటి పురోగతి సాధించలేదని మేం గనుక గుర్తిస్తే కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేస్తాం అని జస్టిస్ ఓకా సంబంధిత అధికారులను హెచ్చరించారు.



రోడ్డుప్రమాదాల సమయంలో ఆ దారిన వెళ్లేవాళ్లు, పోలీసులు, కొన్నిసార్లు ఆస్పత్రులు కూడా ఎవరైనా ముందుకు వస్తారేమో అని ఎదురు చూస్తున్నాయి. ఇది ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తోంది అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఇదిలా ఉంటే.. 2023 డిసెంబర్‌లో నగదు రహిత చికిత్స అందించే విషయంలో కేంద్రం తొలి అడుగు వేసింది. ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ఉచిత, నగదు రహిత వైద్య చికిత్స అందించడం ఎంవీఏ యాక్టు 2019లో భాగం. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు దీన్ని అమలు చేస్తున్నాయి. అయితే.. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహకారంతో రోడ్డు రవాణా, హైవే మంత్రిత్వశాఖ దీన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలనుకుంది. రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రాణాంతకంగా ఉన్న సమయంలో.. ప్రత్యేకించి గోల్డెన్ అవర్ టైంలో రోడ్డు ప్రమాద బాధితుడి ప్రాణాలు రక్షించే చికిత్స కోసం నగదు చెల్లింపులు చేయడానికి ఎవరూ లేనప్పుడు ఈ పథకం వర్తిస్తుంది.

క్యాష్‌లెస్ ఎమర్జెన్సీ ట్రీట్‌మెంట్ స్కీమ్ కింద.. రోడ్డు ప్రమాదాలకు గురైన వాళ్ల చికిత్స కోసం ఏడు రోజులకుగానూ లక్షా 5 వేల రూపాయల ఖర్చు భరిస్తుంది. అయితే ఇది ప్రమాదం జరిగిన 24 గంటలలోపు పోలీసులకు తెలియజేస్తేనే!. ఇక.. ఆస్పత్రులు మోటార్ వెహికిల్స్ యాక్ట్ ఫండ్ నుంచి ట్రీట్‌మెంట్ సొమ్మును రీయింబర్స్‌మెంట్ ద్వారా పొందుతాయి. ఇదికాక.. అదనంగా హిట్ అండ్ రన్ కేసుల్లో మరణించిన వాళ్ల కుటుంబాలకు ప్రభుత్వం రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా కూడా అందిస్తుంది. అయితే.. ఏడాదిన్నరగా ఈ పథకాన్ని ఆచరణలో పెట్టాలనే ప్రయత్నాలు మాత్రం ముందుకు సాగడం లేదు. ఈ ఏడాది జనవరి 8వ తేదీన సరైన విధివిధానాలతో ఓ పథకం రూపొందించాలంటూ కేంద్రానికి సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇదే కాకుండా.. మోటార్ వెహికిల్స్ యాక్ట్(సవరణ చట్టం)లోని సెక్షన్ 162(2) ప్రకారం.. ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా బాధితుల చికిత్సకు అయ్యే ఖర్చును భరించాల్సి ఉంటుంది. కానీ, ఇది కూడా అమలు కావడం లేదని సర్వోన్నత న్యాయస్థానం గుర్తించింది.



మహా పత్రిక







## యూపీ సీఎంను కలిసిన మంచు విష్ణు..
# కన్నప్ప కొత్త డేట్ ఇదే..

హీరో మంచు విష్ణు, ఆయన తండ్రి మోహన్‌బాబు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కలిశారు. బుధవారం నాడు యోగిని కలిసి ఆయనకు శ్రీరాముని జ్ఞాపికను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా కన్నప్ప సినిమా జూన్ 27న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. వీరి వెంట కన్నప్ప కొరియోగ్రాఫర్ ప్రభుదేవా ఉన్నారు. ఈ విషయాన్ని విష్ణు ఎక్స్ (ట్విటర్)లో వెల్లడించాడు. నా ఫేవరెట్ హీరో యోగి ఆదిత్యనాథ్‌గారిని కలిశాను. ఆయన మా కన్నప్ప సినిమా కొత్త రిలీజ్ డేట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు రమేశ్ గొరిజాలా వేసిన పెయింటింగ్‌ను బహుమతిగా ఇచ్చాం. కన్నప్ప.. జూన్ 27న వస్తోంది అని ట్వీట్ చేశాడు. మంచు విష్ణు హీరోగా నటిస్తున్న చిత్రం కన్నప్ప. మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ సినిమాలో ప్రభాస్, కాజల్ అగర్వాల్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్ కీలక పాత్రలు పోషించారు. ఏప్రిల్ 25న రిలీజ్ చేస్తామని గతంలో ప్రకటించారు. కానీ వీఎఫ్ఎక్స్ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయంటూ సినిమాను వాయిదా వేశారు. ఏప్రిల్ 25న తన సినిమా భైరవం రిలీజ్ అవుతుందన్న భయంతోనే విష్ణు కన్నప్పను వాయిదా వేశాడని మనోజ్ ఆరోపించాడు. ఇంతలో విష్ణు.. కన్నప్ప జూన్‌లో రానుందని ప్రకటించాడు.

## నా సినిమాకు భయపడి కన్నప్ప వాయిదా: మంచు మనోజ్



మంచు బ్రదర్స్ మధ్య మరోసారి వార్ మొదలైంది. కూతురు పుట్టినరోజు సెలబ్రేషన్స్ కోసం రాజస్థాన్ వెళ్తే.. తన ఇంటికొచ్చి కారు, కొన్ని వస్తువులు ఎత్తుకెళ్లారని మంచు మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. తాజాగా జల్ పల్లిలోని మోహన్ బాబు ఇంటి దగ్గర బైఠాయించిన మనోజ్.. మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'మా మధ్య ఎలాంటి గొడవల్లేవు. ఇక్కడ పరిస్థితులు బాగోలేకపోవడంతోనే కూతురు పుట్టినరోజు సెలబ్రేట్ చేసుకునేందుకు జైపూర్ వెళ్లాను. మేం ఇక్కడే ఉండొచ్చని హైకోర్ట్ నుంచి ఆర్డర్స్ వచ్చాయి. అయినా ఇంట్లోకి వెళ్లనివ్వట్లేదు. నా తల్లిమీద ప్రమాణం చేసి చెబుతున్నా ఏ రోజు నేను ఆస్తి కోసం గొడవపడలేదు. నేనంటే విష్ణుకి కుళ్లు' 'అన్న కెరీర్ కోసం నేను సినిమాలో లేడీ గెటప్ కూడా వేశాను. ఇప్పుడు నా కారుని దొంగతనం చేశాడు. పాప నగలు ఎత్తుకెళ్లాడు. పెద్దవాళ్లని పిలిచి కూర్చుని మాట్లాడుదామని అడుగుతున్నాను. నా 'భైరవం' సినిమాకు భయపడే 'కన్నప్ప' వాయిదా వేసుకున్నాడు' అని మనోజ్ చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం జరుగుతున్న గొడవ చూస్తుంటే మరికొన్నిరోజుల పాటు మంచు ఫ్యామిలీ గొడవలు జరుగుతాయా అనిపిస్తుంది. ప్రస్తుతానికైతే మనోజ్ మీడియాతో మాట్లాడాడు. మరి మోహన్ బాబువిష్ణు వైపు నుంచి ఏం రెస్పాన్స్ వస్తుందో చూడాలి?

## యాడ్స్‌లో అగ్రహీరోల హవా..
# రోజుకి అన్ని కోట్లా?



హైదరాబాద్ రోడ్ల మీద ఎక్కడ పడితే అక్కడ హోర్డింగ్స్‌లో ఆ నలుగురూ కనపడుతుంటారు. అరవైలో ఇరవైలాగా యాడ్స్‌లోనూ కుర్రహీరోలకు పోటీగా అదరగొడుతుంటారు. తెలుగు సీనియర్ హీరోలు వయసు పెరుగుతున్నా తగ్గేదేలే అన్నట్టుగా ప్రకటనల ప్రపంచంలో దూసుకుపోతున్నారు. మెగాస్టార్ చిరంజీవి తన కెరీర్‌లో ఫిలిప్స్ ఇతర బ్రాండ్‌లకు ఎండార్స్‌మెంట్‌లతో సహా అనేక ప్రకటనలలో పాలుపంచుకున్నారు ఆయన చాలా కాలం క్రితమే ప్రముఖ బ్రాండ్స్‌కు పనిచేశారు. ఆయన చేసిన థమ్సప్ యాడ్ సంచలం సృష్టించడంతో పాటు వివాదాలకు కూడా కేంద్రబిందువైంది. ఆ యాడ్‌లో ఆయన ప్రస్తుత యువ కథానాయకుడు శర్వానంద్‌తో కలిసి కనిపించడం విశేషం. సమకాలీకులతో పోలిస్తే ఒకప్పుడు యాడ్ వరల్డ్‌లోనూ ముందున్న చిరంజీవి ప్రస్తుతం ఈ విషయంలో కొంత వెనుబడ్డారు. ఆయన కంట్రీ డిలైట్ ప్రకటనల్లో కనిపిస్తున్నారు.

కింగ్ నాగార్జున ఒకప్పుడు ప్రకటనల విషయంలో చాలా దూసుకుపోయారని చెప్పాలి. సమకాలీకుల కంటే బాగా ముందుండేవారు. ఐదు పదుల వయస్సు దాటిన హీరోల్లో మిగిలిన వారితో పోలిస్తే ఆయన ఎక్కువగా ప్రకటనల్లో ఆయన కనిపించారు. నాగార్జున అక్కినేని డాబర్ మెస్వాక్ టూత్‌పేస్ట్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా చేశారు, అలాగే కేరళకు చెందిన కళ్యాణ్ జ్యువెలర్స్‌కు బ్రాండ్ అంబాసిడర్. ఈ బ్రాండ్‌కి సంబంధించిన నాగ్ పోస్టర్‌లు ప్రకటనలు కళ్యాణ్ జ్యువెలర్స్‌కు మంచి గుర్తింపునిచ్చాయి. ఘడి డిటర్జెంట్ తో సహా ఇతర ఉత్పత్తుల ప్రకటనలలో కూడా కనిపించిన నాగార్జున అమితాబ్ బచ్చన్ తో కలిసి యాడ్స్ కోసం స్క్రీన్ స్పేస్‌ను పంచుకోవడం విశేషం.


విక్టరీ వెంకటేష్ దగ్గుబాటి మణప్పురం జనరల్ ఫైనాన్స్ అండ్ లీజింగ్ లిమిటెడ్ , రామ్‌రాజ్ కాటన్ కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు అదే విధంగా బైక్ వొ మార్కెటింగ్ బ్రాండ్ ప్రమోషన్ కార్యకలాపాలలో కూడా పాల్గొన్నారు. మూవీ ఈవెంట్స్ ప్రమోషన్స్ కంపెనీ అయిన శ్రేయాస్ మీడియా విక్టరీ వెంకటేష్ మెడ్‌ప్లస్ ప్రకటనతోనే ప్రకటనల రంగంలోకి అడుగు పెట్టింది. బైక్ వోలో వ్యూహాత్మక పెట్టుబడిదారు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న వెంకటేష్.. మార్కెటింగ్, ఔట్రీచ్ బ్రాండ్ ప్రమోషన్ కార్యకలాపాలకు సహకరిస్తున్నారు. ఈ భాగస్వామ్యం 2025 నాటికి భారతదేశం అంతటా 20,000 ఇవి ఛార్జింగ్ పాయింట్‌లను ఇన్‌స్టాల్ చేయాలనే లక్ష్యంతో ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను విస్తరించడం లక్ష్యంగా పెట్టుకుంది. తాజాగా అగ్రగామి రియల్ ఎస్టేట్ బ్రాండ్ కాసా గ్రాండ్ వెంకటేష్‌ను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించింది. తాజాగా బాక్సాఫీస్ హిట్ అయిన సంక్రాంతికి వస్తున్నాం తో...వెంకటేష్‌ను మరింత మంది యాడ్ మేకర్స్ సంప్రదిస్తున్నట్టు సమాచారం.

సమకాలీకులతో పోలిస్తే ఒకప్పుడు ప్రకటనల ప్రపంచంలో పూర్తిగా వెనుకపడిన మాస్ హీరో బాలకృష్ణ అరవై ఐదేళ్ల వయసులో బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ కు టాప్ అడ్రెస్‌గా మారారు. తొలిసారి సౌత్ ఇండియా ఆధారిత కన్‌స్ట్రక్షన్ అండ్ ప్లాటింగ్ సర్వీసెస్ కంపెనీ సాయి ప్రియా గ్రూప్‌తో ప్రకటనల ప్రపంచంలోకి అడుగుపెట్టిన బాలకృష్ణ ప్రస్తుతం మాల్స్ దగ్గర నుంచి నగల బ్రాండ్ల దాకా ప్రమోట్ చేస్తున్నారు. రెండు రోజుల వర్క్‌కి గాను ఆయన రూ. 3 కోట్ల నుంచి ఆపైన దక్కించుకుంటారని యాడ్ నిపుణులు చెబుతున్నారు. అంతకు ముందు, ఆయన ఓ రిటైల్ బ్రాండ్ ప్రచారంలో నటి ప్రగ్యా జైస్వాల్‌తో కలిసి కనిపించాడు. 'అఖండ', 'భగవంత్ కేసరి' 'వీరసింహారెడ్డి' వంటి హ్యాట్రిక్ హిట్‌లతో, నటుడిగా అతని స్థాయి పెరిగింది. 'వరుసగా మూడు బ్లాక్‌బస్టర్‌లు కొట్టడంతో టాలీవుడ్‌లో తన సమకాలికుల కంటే యాడ్ వరల్డ్‌లో ముందున్నాడు



## ఊర్వశి రౌతేలా క్రేజ్..
# డాకు మహారాజ్ చిత్రానికి అవార్డ్!

బాలీవుడ్ భామ ఊర్వశి రౌతేలా ఈ ఏడాది డాకు మహారాజ్‌తో టాలీవుడ్ ప్రియులను అలరించింది. బాలకృష్ణ హీరోగా నటించిన ఈ సినిమాలో కీలక పాత్ర పోషించింది. అంతేకాకుండా ఈ సినిమాలో దబిడి దిబిడి సాంగ్‌తో ఫ్యాన్స్‌ను మెప్పించింది. అయితే ఈ పాటపై పెద్దఎత్తున వివాదానికి దారితీసింది. ఈ సాంగ్ కొరియోగ్రఫీపై పలువురు విమర్శలు చేశారు. ఇవన్నీ పక్కన పెడితే తాజాగా బాలీవుడ్ భామను ఓ అవార్డ్ వరించింది. ఫ్యాన్స్ ఫేవరేట్ ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ 2025కు ఎంపికైంది ముద్దుగుమ్మ. డాకు మహారాజ్ చిత్రంలో ప్రదర్శనకు గానూ గోల్డెన్ క్వీన్ అవార్డ్‌ను దక్కించుకుంది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. అవార్డ్ చేతిలో పట్టుకుని ఉన్న ఫోటోలను షేర్ చేసింది. అంతే కాకుండా తనకు సపోర్ట్ చేస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపింది.



# క్రీడా వార్తలు | SPORTS NEWS






# సాయి సుదర్శన్ విధ్వంసం..
## రాజస్థాన్‌పై గుజరాత్ ఘన విజయం

ఐపీఎల్ 2025లో భాగంగా ఇవాళ (ఏప్రిల్ 9) జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై గుజరాత్ టైటాన్స్ 58 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్.. సాయి సుదర్శన్ (53 బంతుల్లో 82; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) చెలరేగడంతో నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 217 పరుగుల భారీ స్కోర్ చేసింది. గుజరాత్ ఇన్నింగ్స్‌లో జోస్ బట్లర్ (25 బంతుల్లో 36; 5 ఫోర్లు), షారుక్ ఖాన్ (20 బంతుల్లో 36; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), రాహుల్ తెవాతియా (12 బంతుల్లో 24 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) కూడా రాణించారు. రషీద్ ఖాన్ 4 బంతుల్లో ఫోర్, సిక్స్ సాయంతో 12 పరుగులు, రూథర్‌ఫోర్డ్ 3 బంతుల్లో సిక్స్ సాయంతో 7 పరుగులు, శుభ్‌మన్ గిల్ 3 బంతుల్లో 2 పరుగులు చేశారు. రాయల్స్ బౌలర్లలో తుషార్ దేశ్‌పాండే, తీక్షణ తలో రెండు వికెట్లు తీయగా.. ఆర్చర్, సందీప్ శర్మ చెరో వికెట్ తీశారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనకు దిగిన రాయల్స్ గుజరాత్ బౌలర్లు కలిసికట్టుగా రాణించడంతో 19.2 ఓవర్లలో 159 ఆలౌటైంది. ప్రసిద్ధ్ కృష్ణ 3, రషీద్ ఖాన్, సాయి కిషోర్ చెరో 2, సిరాజ్, అర్షద్ ఖాన్, కేజ్రోలియా తలో వికెట్ పడగొట్టారు. రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో షిమ్రోన్ హెట్‌మైర్ (32 బంతుల్లో 52; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) టాప్ స్కోరర్‌గా నిలువగా.. సంజూ శాంసన్ (28 బంతుల్లో 41; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), రియాన్ పరాగ్ (14 బంతుల్లో 26; ఫోర్, 3 సిక్సర్లు) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. యశస్వి జైస్వాల్ (7 బంతుల్లో 6; ఫోర్), నితీశ్ రాణా (3 బంతుల్లో 1), ధృవ్ జురెల్ (4 బంతుల్లో 5; ఫోర్), శుభమ్ దూబె (3 బంతుల్లో 1), తుషార్ దేశ్‌పాండే (3 బంతుల్లో 3), జోఫ్రా ఆర్చర్ (4 బంతుల్లో 4), తీక్షణ (13 బంతుల్లో 5) విఫలమయ్యారు.

# కళ్లు చెదిరే క్యాచ్ పట్టిన జైస్వాల్..
## రషీద్ ఖాన్‌కు మతి పోయింది..!



ఐపీఎల్ 2025లో భాగంగా ఇవాళ (ఏప్రిల్ 9) గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్ తలపడుతున్నాయి. అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకుంది. అయితే రాయల్స్ అంచనాలకు తగ్గట్టుగా గుజరాత్‌ను కంట్రోల్ చేయలేకపోయింది. సాయి సుదర్శన్ (53 బంతుల్లో 82; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) చెలరేగడంతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 217 పరుగుల భారీ చేసింది. ఆదిలోనే శుభ్‌మన్ గిల్ (2) వికెట్ కోల్పోయినప్పటికీ.. సాయి సుదర్శన్, జోస్ బట్లర్ (25 బంతుల్లో 36; 5 ఫోర్లు) గుజరాత్ ఇన్నింగ్స్‌ను నిర్మించారు. బట్లర్ ఔటైన అనంతరం సాయి సుదర్శన్‌తో షారుక్ ఖాన్ (20 బంతుల్లో 36; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) జత కట్టాడు. బట్లర్, షారుక్ ఖాన్‌లతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన సాయి జట్టు భారీ స్కోర్ చేయడానికి దోహదపడ్డాడు. షారుక్ ఖాన్ ఔటయ్యాక క్రీజ్‌లోకి వచ్చిన రూథర్‌ఫోర్డ్ (3 బంతుల్లో 7; సిక్స్) తొలి బంతికే సిక్సర్ బాది మంచి టచ్‌లో ఉన్నట్లు కనిపించాడు. అయితే సందీప్ శర్మ అద్భుతమైన బంతితో రూథర్‌ఫోర్డ్‌ను పెవిలియన్‌కు పంపాడు. ఇన్నింగ్స్ చివరల్లో రాహుల్ తెవాతియా (12 బంతుల్లో 24 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సర్లు), రషీద్ ఖాన్ (4 బంతుల్లో 12; ఫోర్, సిక్స్) తమ సహజ శైలిలో విరుచుకుపడటంతో గుజరాత్ 200 పరుగుల మార్కును దాటింది. రాయల్స్ బౌలర్లలో తుషార్ దేశ్‌పాండే, తీక్షణ తలో రెండు వికెట్లు తీయగా.. ఆర్చర్, సందీప్ శర్మ చెరో వికెట్ తీశారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనకు దిగిన రాయల్స్ 11 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. జైస్వాల్‌ను (6) అర్షద్ ఖాన్, నితీశ్ రాణాను (1) సిరాజ్ ఔట్ చేశారు. 4.2 ఓవర్ల తర్వాత రాయల్స్ స్కోర్ 41/2గా ఉంది. సంజూ శాంసన్ (16), రియాన్ పరాగ్ (14) ధాటిగా ఆడుతూ క్రీజ్‌లో ఉన్నారు. ఈ మ్యాచ్‌లో రాయల్స్ గెలవాలంటే మరో 94 బంతుల్లో 177 పరుగులు చేయాలి.

### జైస్వాల్ స్టన్నింగ్ క్యాచ్

ఈ మ్యాచ్‌లో రాయల్స్ ఆటగాడు యశస్వి జైస్వాల్ కళ్లు చెదిరే క్యాచ్ పట్టాడు. ఇన్నింగ్స్ 19వ ఓవర్ ఆఖరి బంతికి రషీద్ ఖాన్ కొట్టిన నో లుక్ షాట్‌ను (తుషార్ దేశ్‌పాండే బౌలింగ్‌లో) జైస్వాల్ నమ్మశక్యం కాని రీతిలో క్యాచ్‌గా మలిచాడు. అప్పటికి రషీద్ ఖాన్ అదే ఓవర్‌లో వరుసగా సిక్సర్, బౌండరీ బాది మాంచి జోష్‌లో ఉన్నాడు. జైస్వాల్ ఈ క్యాచ్ పట్టకపోయుంటే రషీద్ మరింత చెలరేగిపోయేవాడు. జైస్వాల్ పట్టిన ఈ క్యాచ్ సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతుంది.

# ఆర్చర్ దెబ్బకు స్పీడ్ గన్‌కు చుక్కలు.. రెండో ఫాస్టెస్ట్ డెలివరీ



ఐపీఎల్2025లో భాగంగా ఇవాళ (ఏప్రిల్ 9) గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్‌లో రాయల్స్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ నిప్పులు చెరిగే వేగంతో బౌలింగ్ చేస్తున్నాడు. మూడో ఓవర్‌లో గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను (2) క్లీన్ బౌల్డ్ చేసిన ఆర్చర్.. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో ఓ బంతిని బుల్లెట్ వేగంతో సంధించాడు. ఈ బంతి స్పీడ్ గన్‌పై గంటకు 152.3 కిమీ వేగంగా రికార్డైంది. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఇది రెండో వేగవంతమైన బంతి. ఈ సీజన్ ఫాస్టెస్ట్ డెలివరీని పంజాబ్ పేసర్ లోకీ ఫెర్గూసన్ వేశాడు. ఫెర్గూసన్ నిన్న లక్నోతో జరిగిన మ్యాచ్‌లో గంటకు 153.2 కిమీ వేగంతో ఓ బంతిని సంధించాడు. ఈ సీజన్ ప్రారంభం నుంచి ఆర్చర్ బుల్లెట్ వేగంతో బంతులు వేస్తున్నాడు. పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ 150 కిమీకుపైగా స్పీడ్‌తో బంతులు వేశాడు. పంజాబ్ మ్యాచ్‌లో ఆర్చర్ ఓ బంతిని 151.3 కిమీ వేగంతో వేశాడు. ఇది ప్రస్తుత సీజన్‌లో నాలుగో ఫాస్టెస్ట్ బంతిగా రికార్డైంది. గుజరాత్‌తో మ్యాచ్‌లో ఆర్చర్ శుభ్‌మన్ గిల్‌ను క్లీన్ బౌల్డ్ చేసిన బంతికి కూడా దాదాపుగా 150 కిమీ వేగంతో (147.7) వచ్చింది. ఈ సీజన్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో దారుణంగా విఫలమైనా ఆర్చర్ సీఎస్‌కేతో జరిగిన మ్యాచ్ నుంచి గాడిలో పడ్డాడు. ఆ మ్యాచ్‌లో ఆర్చర్ 3 ఓవర్లలో ఓ మెయిడిన్ సహా 13 పరుగులు మాత్రమే ఇచ్చి ఓ వికెట్ పడగొట్టాడు. ఆ మ్యాచ్‌లో రాయల్స్ గెలుపులో ఆర్చర్ కీలకపాత్ర పోషించాడు. పంజాబ్‌తో జరిగిన గత మ్యాచ్‌లో ఆర్చర్ శివాలెత్తిపోయాడు. ఆ మ్యాచ్‌లో అతను 4 ఓవర్లలో 25 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు తీశాడు. ఫలితంగా ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు కూడా పొందాడు. ప్రస్తుతం గుజరాత్‌తో జరుగుతున్న మ్యాచ్‌లోనూ ఆర్చర్ చెలరేగిపోతున్నాడు. ఈ మ్యాచ్‌లో ఇప్పటివరకు 3 ఓవర్లు వేసిన అతను కేవలం 19 పరుగులు మాత్రమే ఇచ్చి గిల్ వికెట్ తీశాడు. మ్యాచ్ విషయానికొస్తే.. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ ఆదిలోనే శుభ్‌మన్ గిల్ (2) వికెట్ కోల్పోయినప్పటికీ.. ఆతర్వాత కుదురుకుంది. సాయి సుదర్శన్, బట్లర్ ఇన్నింగ్స్‌ను నిర్మించారు. అయితే 10 ఓవర్ చివరి బంతికి తీక్షణ అద్భుతమైన బంతితో బట్లర్‌ను (36) ఎల్బీడబ్ల్యూ చేశాడు. సాయి సుదర్శన్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని (59) ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నాడు. అతనికి జతగా షారుక్ ఖాన్ (18) క్రీజ్‌లో ఉన్నాడు. 13 ఓవర్ల తర్వాత గుజరాత్ స్కోర్ 124/2గా ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

# గురుకుల పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు

## ఎమ్మెల్యేకు వినతి



**రంగారెడ్డి జిల్లా, మహా:** గురుకుల పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డికి మెమోరాండం అందజేశారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ ఇబ్రహీంపట్నం బాలుర పాఠశాలలో మౌలిక సదుపాయాలు, సౌకర్యాలకు సంబంధించిన ముఖ్యమైన సమస్యల పరిష్కారానికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి ముఖ్యమైన సమస్యల గురించి పాఠశాల ప్రిన్సిపాల్ ప్రిన్సి వరూధిని వివరించడం జరిగింది. దేశం యొక్క భవిష్యత్తును పెంపొందించడానికి కట్టుబడి ఉన్నాము. మేము మా విద్యార్థుల జీవన నాణ్యత, విద్యను దెబ్బతీసే అనేక సవాళ్లను పాఠశాలలో ఎదుర్కొంటున్నాము.

**పాఠశాలలో ఎదుర్కొంటున్న సమస్యలు...**

అసురక్షిత, శిథిలమైన మౌలిక సదుపాయాలు, స్వచ్ఛమైన తాగునీటి కొరత, విద్యుత్ లైటింగ్ లేకపోవడం, ఫర్నిచర్ మరియు తరగతి గది వనరులు, భద్రత పరంగా పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ. పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనీ, సరైన పైప్‌లైన్‌లతో స్వచ్ఛమైన సురక్షితమైన నీటిని నిరంతరాయంగా నిరంతరాయంగా అందించాలని కోరనైనది. పాఠశాలలో విద్యార్థుల అవసర నిమిత్తం బోర్‌వెల్ వేయించాలని కోరారు. ప్రతికూల వాతావరణంలో భద్రత, అసౌకర్యానికి దారితీసే అనేక కిటికీలు, తలుపులు దెబ్బతిన్నాయి. పాఠశాలకు రక్షణ కోసం గోడ లేదు, దీని కారణంగా విద్యార్థులకు భద్రత కరువైందని విన్నవించుకున్నారు.

**పాఠశాల భవనానికి రంగులు వేయించాలి....**

విద్యార్థులకు స్వచ్ఛమైన, ఉత్తేజకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించడానికి తరగతి గదులు, వసతి గృహాలకు రంగులు వేయించాలని తెలిపారు. పాఠశాలలో చాలావరకు మరుగుదొడ్లకు సరైన తలుపులు లేవు. వంటగది ఫ్లోరింగ్ దెబ్బతింది, విద్యార్థులకు వసతి గృహంలో, తరగతి గదులలో సీలింగ్ ఫ్యాన్ల కొరత, డైనింగ్ ఏరియాలో వేడి వాతావరణంలో అసౌకర్యాన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భద్రతను నిర్ధారించడానికి ఏదైనా సంఘటనలను నివారించడానికి, అన్ని కిటికీలకు ఇనుప చువ్వలు వేయించాలని అన్నారు. పాఠశాల భవనం నుండి డైనింగ్ హాల్ వరకు కొత్త ఫ్లోరింగ్, సరైన పాత్‌వే ఫ్లోరింగ్ అవసరం అని స్థానిక ఎమ్మెల్యేను కోరారు. సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ.. సాంఘిక సంక్షేమ పాఠశాలల సమస్యలపై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని తెలిపారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విద్యార్థులను తీర్చిదిద్దే పాఠశాలలో, సమస్యల పట్ల పై అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### చిలుకూరు బాలాజీ

## బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** చిలుకూరు దేవాలయంలో వారం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు సిఎస్ రంగ రాజన్ స్వామి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అంకురార్పణ చేశారు. రంగారెడ్డి జిల్లా, మొయినాబాద్ మండలం, చిలుకూరులోని బాలాజీ ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయ ప్రధాన మండపంలో స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి బ్రహ్మోత్సవాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలతో దేవాలయం మారుమోగింది. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయం ప్రాంగణంలో ఊరేగించిన అనంతరం యజ్ఞ మహోత్సవం నిర్వహిచారు. పూజా కార్యక్రమాలు తిరుమల కిరణాచారి, రామస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణ స్వామి, అర్చకులు రంగరాజన్ పాల్గొన్నారు.

# రైతులు పండించిన ప్రతీ గింజనూ కొంటాం

- దళారులను నమ్మి మోసపోవద్దు.. ఎమ్మెల్యే యశశ్వినీ రెడ్డి



**తొర్రూరు,మహా:** మహబూబాద్ జిల్లా తొర్రూరు మండలం వెలికట్ట గ్రామంలో రైతులు పండించిన ధాన్యంను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని, దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్వినీ రెడ్డి సూచించారు.బుధవారం తొర్రూర్ మండలం వెల్లికట్టే గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సన్నరకం వడ్లకు క్వింటాకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నామని, రైతులకు ఏ ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతులు కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గంలో ప్రతి రైతుకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. చివరి గింజ వరకు కొంటామని రైతులకు అవసరమైన బస్తాలు, తాగునీటి సౌకర్యం, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేదవారికీ సన్న బియ్యం ఉచితంగా అందిస్తున్నారు.. గత ప్రభుత్వం మాటలకే పరిమితం అయ్యిందని.. మన ప్రభుత్వం చేతల ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన

## రుణమాఫీ హామీని అమలు చేయాలి

- రాష్ట్ర రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు మంద సారంగపాణ
- కలెక్టరేట్ ఎదుట ధర్నా




**ములుగు, మహా :** ములుగు జిల్లాలోని రైతుల సమస్యలు పరిష్కరించాలని, రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన రుణమాఫీ హామీని వెంటనే అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు, రిటైర్డు ప్రొఫెసర్ మంద సారంగపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ములుగులో కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.అమ్జద్ పాషా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ మహేందర్ జీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలన్నారు. పంటలు పండించే రైతులందరికీ రైతు భరోసా సత్వరమే చెల్లించాలని, ఫజల్ బీమాను సులభతరం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి కేవలం రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేశారన్నారు. పాహనీ నకల్ ద్వారా రుణాలు తీసుకున్న రైతులకు సైతం రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. ములుగు మండలం కాసిందేవిపేట, పత్తిపల్లి, పొట్లాపూర్, చిన్న గుంటూరుపల్లి, అన్నంపల్లి తదితర గ్రామాలకు రంగాయచెరువుకు వెళ్లే దేవాదుల పైపులైన్ ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, సీనియర్ నాయకులు ఇంజన్ కొమురయ్య, రైతు సంఘం నాయకులు బండి నరసయ్య, బోడ రమేష్, వెంకటస్వామి రెడ్డి, మర్రి స్వామి, ఆగబోయిన సాంబయ్య, కొయ్యడ లక్ష్మి, ఈసం మహేందర్, లక్ష్మీనారాయణ, మనోహర్, వెంకట్రాం తదితరులు పాల్గొన్నారు.

### బైక్ అదుపుతప్పి

## వ్యక్తి మృతి

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహా:** బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ జి శ్రావణ్ కుమార్ కథనం ప్రకారం మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన జిల్లెల్ల కుమార్ అనునతను గ్రామపంచాయతీ నందు కారోబార్ గా పనిచేస్తూ..ఉపాధి హామీ పనుల నిమిత్తం..శాంతినగర్ లో జరుగుతున్న పనుల వద్దకు వెళ్లారు. అక్కడ చేస్తున్న కూలీ పనుల వివరాలు తీసుకుని చిట్యాల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రిపోర్టు వివరాలు తెలియజేసి, అలాగే చిట్యాలలో ఉన్న పనులను చూసుకుని రాత్రి 10:45 గంటల సమయంలో తన మోటార్ సైకిల్ పై నవాబుపేటకు వెళ్తూ..మార్గమధ్యలో సివిల్ సప్లై గోదాం మూల మలుపు వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి ఎదురుగా ఉన్న తాటి చెట్టుకు ఢీ కొట్టగా..తలకు బలమైన గాయాలు తగలడంతో..మృతుడు అక్కడికక్కడే చనిపోయాడు.స్థానికులు మృతుడిని చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడని, తదుపరి చర్యల నిమిత్తం మృతుడి భార్య జిల్లెల్ల కృప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి శ్రావణ్ కుమార్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

### పెంచిన గ్యాస్ ధరలను

## వెంటనే తగ్గించాలి

**సిపిఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు డి కిషన్**




**అబ్దుల్లాపూర్ మెట్,మహా:** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు డి కిషన్ డిమాండ్ చేశారు. బుధవారం తుర్కయంజాల్ మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నాగార్జునసాగర్ రహదారిపై వంట గ్యాస్ సిలిండర్ తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు డి.కిషన్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్ లో క్రూడాయిల్ ధరలు 2024 నుంచి క్రమంగా తగ్గుతూ ఇటీవలి కాలంలో అవి మరింత తగ్గాయి..కానీ కేంద్ర ప్రభుత్వం ఒకేసారి సిలిండర్ పై 50 రూపాయలను పెంచడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. పెరిగే గ్యాస్ ధరల ప్రభావం మిగతా నిత్యవసర వస్తువుల ధరలపై కూడా పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రజలకు ఉపాధి లేక ఆదాయం లేక నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతూ వారి కొనుగోలు ఆ క్షీణిస్తుందని ఈ క్రమంలో ఇలా ధరలు పెంచుకుంటూ పోతే ప్రజల జీవనం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు మండల సత్యనారాయణ, ఇల్లూరి భాస్కర్, బడుగు మాల్యాద్రి, నాయకులు ఎన్ యాదగిరి, గనిపల్లి రాములు, మద్దెల యాదయ్య, జక్క హనుమంత్ రెడ్డి, గుండా బాలరాజ్, బండ బీరప్ప, మధుకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

**సిఐటియు రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నరసింహా**



**అబ్దుల్లాపూర్ మెట్,మహా:** పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి, ఆరు నెలల నుంచి పెండింగ్ లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని సిఐటియు రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ అన్నారు. ఈనెల 19 నుంచి నిర్వహించబోయే సమ్మెకు సంబంధించి ఎంపీఓ మధుసూదనా చారి కి నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలను నిలబెట్టుకొని.. జీవో నెంబర్ 51 సవరించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కనీస వేతనం 26000 రూపాయలు ఇవ్వాలని అదేవిధంగా రెండవ పిఆర్సి గ్రామపంచాయతీ వర్కర్లకు కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈనెల 19 నుంచి సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించాలని పిలుపునిచ్చామన్నారు. ప్రభుత్వ స్పందించి వెంటనే ఆరు నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని, ప్రతి వేట ఇవ్వాల్సిన డ్రెస్సులు సబు నూనెలు, ఇవ్వకపోతే సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. గ్రామపంచాయతీ కార్మికులు అనేక సంవత్సరాలకు పనిచేస్తున్న, ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎంతమంది మంత్రులు మారినా అధికారులు మారిన పంచాయతీ సిబ్బంది, బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కావున వెంటనే ప్రభుత్వం దిగివచ్చి పై సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు, అంజయ్య, బాలయ్య, లక్ష్మయ్య, జ్యోతి, కవిత, బిక్షపతి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వారం రోజులు టైం ఇస్తున్న తర్వాత ఇక మీ ఇష్టం



**రంగారెడ్డి జిల్లా, మహా:** మహేశ్వరం నియోజకవర్గం, ఆర్కేపురం డివిజన్, ఎన్టీఆర్ నగర్లో చాలా రోజుల నుండి నీళ్లు రాకపోవడంతో కన్నీటి పర్వమైన మహిళ. సదరు మహిళను సముదాయించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి. డివిజన్లో పర్యటించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, సమస్యల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

**అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో వాటర్ సమస్య లేకుండా చేశామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. డివిజన్ లో వాటర్ ట్యాంకర్లు తప్ప మరేం కనబడడం లేదని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. ప్రజల పట్ల ప్రభుత్వం బాధ్యత లేకుండా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. వారం రోజులలో ఎన్టీఆర్ నగర్ లోని ప్రజలు ఎదుర్కొంటున్న, నీటి సమస్యను పరిష్కరించుకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**ముఖ్యమంత్రిపై ధ్వజమెత్తిన మాజీ మంత్రి...**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూముల అమ్మకం పై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యల పై లేదని ధ్వజమెత్తారు. హైదరాబాద్ నడిబొట్టున ఉన్న మంచినీటి సమస్యను తీర్చాలని డిమాండ్ చేశారు. గతంలో లేని నీటి సమస్య ఇప్పుడు ఎందుకు వస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ వ్యవస్థను నడపడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### అడవులే

## మా జీవనాధారం


ఆదివాసి యువజన సంఘం

**కాటారం, మహా :** ఆపరేషన్ కగార్ దాడినుండి రక్షణ పొందడానికి కర్రె గుట్టలపై బాంబులు పెట్టామని అటువైపు వేటకు, తునికాకు సేకరణకు, అటవీ ఉత్పత్తుల కోసం ఎవరూ వెళ్లకూడదు అంటూ ఆదివాసి ప్రజలకు సిపిఐ మావోయిస్టు వెంకటాపురం వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరుతో ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలంగాణ రాష్ట్రం ఆదివాసి యువజన సంఘం ఒక ప్రకటన విడుదల చేశారు. మావోయిస్టులారా నిత్యం ఆదివాసి ప్రజలపై ఆధారపడి బ్రతికే మీరు అడవులే ఆధారంగా జీవనోపాధి పొందుతున్న ఆదివాసి ప్రజలను అడవుల్లోకి రావద్దని చెప్పే అధికారం మీకు ఎవరిచ్చారని లేఖలో పేర్కొన్నారు.భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను నియంత్రించే అధికారం మీకెక్కడిది? అని ప్రశ్నించారు.అడవుల్లో విచ్చలవిడిగా మందుపాతారలు పెడితే ఆదివాసుల లు బ్రతికేదెలా..మమ్మల్ని బ్రతకనివ్వరా మా ప్రాంతాలపై మీ పెత్తనమేంటి.. మేము అడవుల్లోకి వెళ్లకుండా ఇంకెక్కడికి వెళ్లాలి మీరు తలదాచుకోవడానికి మా ప్రాంతాలే దొరికాయా అని మీరు అమర్చిన మందుపాతారాల వల్ల ఇప్పటికే చాలామంది అమాయక ఆదివాసులు చనిపోయారని ఎందరో ఆదివాసులు శాశ్వత అంగవైకల్యానికి గురయ్యారని లేఖలో వివరించారు. మూగజీవాలు సైతం ప్రాణాలు కోల్పోయాయి. పోలీసు ఇన్ ఫార్మర్ల నెపంతో దారుణ హత్యలు చేస్తున్నారు.ఎన్నో కుటుంబాలు అనాధలై రోడ్డున పడ్డాయి. మేము ఎవరిమీద ఆధార పడకుండా మా బ్రతుకులు మేము బ్రతుకుతున్నాము. పోలీసు ఇన్ఫార్మర్లుగా మారాల్సిన అవసరం మాకు అసలు లేనేలేదు. పోలీసు ఇన్ఫార్మర్లనే నిందలు మాపై మోపుతున్నారు. మేము కేవలం మా జీవనాధారం కోసమే అడవుల్లోకి వెళ్తున్నాం. కేవలం మీ ప్రాణాలకు మమ్మల్ని బలి పశువులుగా చేస్తూ కనీస అభివృద్ధికి కూడా నోచుకోకుండా అనుక్షణం అడ్డుపడుతూనే ఉన్నారు. ఇదేనా మీ సిద్ధాంతం ?ఎందుకోసమేనా మీ ఉద్యమం? ఆదివాసి ప్రజల జీవనోపాధి అడ్డుకుంటే మీ నియంతృత్వ పోకడలపై కొమురం భీమ్ పోరాట స్ఫూర్తితో ఆదివాసి సమాజం వేలాది మందితో దండెత్తి మీపై తిరుగుబాటు చేస్తాం. బాంబులు పెట్టామని చెప్పడం వల్ల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న మిమ్మల్ని చూస్తూ ఊరుకోము. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకడం. మా సహనాన్ని పరీక్షించకండి.

### కాషాయ సైనికులే పార్టీకి కీలకం..

## కార్యకర్తలే వెన్నెముక



- అనేక విజయాల్లో కార్యకర్తల పాత్ర మరువలేనిది
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చదువు రాంచంద్రారెడ్డి

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహా:** భారతీయ జనతా పార్టీ విజయాల్లో పార్టీకి కాషాయ సైనికులే కీలకమని...కార్యకర్తలే వెన్నెముక అని, వారి శక్తి, ఉత్సాహం ప్రేరణాదాయకమని, కొన్ని సంవత్సరాలుగా పార్టీ బలోపేతం కోసం తమ జీవితాలను అంకితం చేసిన వారి సేవలు మరువలేనివని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదువు రాంచంద్రారెడ్డి, భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్ మోరే రవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని అమ్మ గార్డెన్ లో భాజపా 45వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బిజెపి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి మండల అధ్యక్షుడు మోరే వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన వహించారు. అనంతరం చదువు రాంచంద్రా రెడ్డి , మోరే రవీందర్ రెడ్డి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. దేశంలోని ప్రజలంతా బిజెపి సుపరిపాలనను చూస్తున్నారని, ఇటీవల పార్టీ సాధించిన అనేక చారిత్రాత్మక విజయాల్లో ఇది ప్రతిబింబిస్తోందన్నారు. బిజెపి 45వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ పురోగతికి "వికసిత్ భారత్" స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు ప్రధాని నరేంద్ర మోదీ సారధ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సమాజ సర్వతోముఖాభివృద్ధి దిశగా ఎన్డీఏ ప్రభుత్వం సేవ చేస్తుందన్నారు. 1980లో స్థాపించిన భారతీయ జనతా పార్టీ 1984లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో రెండు లోక్ సభ స్థానాలను మాత్రమే గెలుచుకొని ఆ తర్వాత అటల్ బిహారీ వాజ్ పేయ్, ఎల్ కె అద్వానీ నాయకత్వంలో అంచెలంచెలుగా ఎదిగి..1990లో మిత్రపక్షాలతో కలిసి బిజెపి అధికారాన్ని చేజిక్కించుకుందన్నారు. అనంతరం 2014 నుంచి ప్రధాని మోదీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం వరుసగా మూడోసారి కేంద్రంలో కొలువు తీరిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి దళిత మోర్చ రాష్ట్ర నాయకులు కుమ్మరి సారయ్య, బిజెపి రాష్ట్ర నాయకులు జమలాపురం సాంబశివరావు, దళిత మోర్చ జిల్లా అధ్యక్షుడు పుల్యాల రాజు, పార్లమెంట్ ఫుల్ టైమర్ మంద రాజేష్, మండల ప్రధాన కార్యదర్శి బండారి శ్రీనివాస్, అరికాంతపు కృష్ణారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ పెండ్లి మల్లారెడ్డి, మండల ఉపాధ్యక్షులు బల్గూరి కిషన్ రావు, రాస బిక్షపతి, జిల్లా నాయకులు అనుముల శ్రీనివాస్, పులి వెంకట్ రెడ్డి, మునిగంటి మల్లారెడ్డి, వైనాల ప్రియాంక, శివకుమార్, రాజేశ్వర్ రావు, బల్గూరి తిరుపతిరావు, వంగ రవి, పొన్నాల మల్లారెడ్డి, జమలాపురం రాజు, యార జయపాల్ రెడ్డి, పెండ్లి మల్లారెడ్డి, మండల నాయకులు రేపాల శ్రీనివాస్, బండారి తిరుపతి, చిలుకమారి రాజేంద్రప్రసాద్, బోయిని తిరుపతి, కక్కర్ల వీరన్న, పొడిసెట్టి రవి, దేశిని భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన యువకుడు దారుణ హత్య

**గొడ్డలితో నరికి చంపిన గుర్తు తెలియని దుండగులు**



**వాజేడు, మహా:** మండలంలోని పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త టేకులగూడెం గ్రామానికి చెందిన గిరిజన యువకుడు వాసం విజయ్(28) ను గుర్తు తెలియని దుండగులు తలపై గొడ్డలితో మోది అతి దారుణంగా హత్య జరిగిన ఘటన సంచలనం సృష్టిస్తోంది.విషయం తెలుసుకున్న వెంకటాపురం సిఐ బండార్ కుమార్ పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యుల నుండి వివరాలు సేకరించి విచారణ ప్రారంభించారు.గుర్తు తెలియని వ్యక్తులు ఇంతటి దారుణానికి ఒడిగట్టడంతో టేకులగూడెం గ్రామంలో అలజడి మొదలైంది ఈ హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రాజ్యాంగాన్ని మార్చాలని అనడం

## బీజేపీ పతనానికి నాంది

- జై బాపు జై భీం జై సంవిధాన్ నినాదాన్ని ప్రజలలోకి తీసుకెళ్ళాలి
- కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి




**శాయంపేట, మహా:** కేంద్ర మంత్రి అమిత్ షా రాజ్యాంగాన్ని మార్చాలని అనడం బీ జే పీ పతనానికి నాంది అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు.స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు మండలంలోని నేరేడుపల్లి అప్పయ్యపల్లి ప్రగతి సింగారం గ్రామాలలో కాంగ్రెస్ నాయకులతో కలిసి జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జై బాపు, జై భీం, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్ళాలని అన్నారు.పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి అమిత్ షా రాజ్యాంగాన్ని మార్చాలని అనడం బీ జే పీ పతనానికి నాంది అని అభివర్ణించి రాజ్యంగంతోనే బడుగు బలహీన వర్గాలకు అన్ని రంగాలలో న్యాయం జరుగుతుందని అన్నారు. కేంద్రం రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్ర చేస్తుందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమ ఇంచార్జ్ ప్రణయ్ దీప్ కాంగ్రెస్ నాయకులు చల్లా చక్రపాణి,పోలపల్లి శ్రీనివాస్ రెడ్డి,మారెపల్లి రవీందర్,రఘుపతి రెడ్డి,ఆది రెడ్డి, కృష్ణమూర్తి,చిందం రవి,నిమ్మల రమేష్,హైదర్,సమ్మిరెడ్డి భాస్కర్, రాజు,వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# గృహ సందర్శన, పోషణ పక్షం ప్రారంభించిన



**హుజూర్ నగర్, మహా:** గర్భిణీ, బాలింతలు, మహిళలందరికీ కోసమే పోషణ పక్షం నిర్వహిస్తున్నట్లు సిడిపిఓ వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం హుజూర్ నగర్ లోని 19, 20 వార్డులలో గృహ సందర్శనలో భాగంగా గృహాలను సందర్శించి పోషకాహార విలువలను ఎలా పొందవచ్చు వివరించి అంగన్వాడీ కేంద్రం 8లో పోషక పక్షం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉన్న ఆకుకూరలు, గింజలు, పండ్లు లతో పోషకాహారం ఎలా పొందవచ్చు అని ఆహారంలో పోషక విలువలు ఉన్నట్లయితే అనారోగ్యం దరిచేరదన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు అంగన్వాడి కేంద్రంల ద్వారా అందిస్తున్న ఆహారాన్ని, విద్యను, వైద్యము సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సోమమ్మ, టీచర్లు షహజాదీ బేగం, సరళ కుమారి, రాజేష్, హెల్త్ సూపర్వైజర్ పద్మ, ఏఎన్ఎం లలిత, ఆశాలు సుశీల, జ్యోతి, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

### ప్రజల అభివృద్ధి లక్ష్యంగా

## అమెజాన్ అడుగులు



**రంగారెడ్డి జిల్లా, మహా:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అమెజాన్ కంపెనీ వారి సౌజన్యంతో యాచారం మండలం, గునుగల్ గ్రామంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్లో విద్యార్థుల సౌకర్యార్థం కోసం నూతనంగా నిర్మించిన డైనింగ్ హాలు ను అమెజాన్ ప్రతినిధులతో కలిసి, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం మండలం, తులేకలాన్(పెత్తుల) గ్రామంలో అమెజాన్ వారి ఆధ్వర్యంలో నూతన గ్రంథాలయ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న అమెజాన్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు, ప్రతి గ్రామంలో గ్రంథాలయాలు నిర్మించి భవిష్యత్ తరాల వారికి చదువులకు నిలయంగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోదూరి రమేష్, మాజీ సర్పంచ్ బత్తుల రామ్ రెడ్డి , సత్తు శశాంక్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకులు, దోమ సుదర్శన్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు కోదూరు పాండు, బోడో మహేందర్, ఎన్ ఎస్ యు ఐ నియోజకవర్గ సెక్రటరీ బోద విజయ్, పి జంగయ్య తిరుమల్ రెడ్డి, సాయి, పాండు, శివ, ప్రభు, సంజీవ, శ్రీను, చింటూ రెడ్డి, జక్కుల మల్లేష్, అచ్చన్న బీరప్ప, బండి దాసు, శంకర్, యాదయ్య, నరసింహ, విష్ణువర్ధన్ రెడ్డి, బుగ్గయ్య, అంజయ్య,, బుజరామయ్య,బండ శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.